ఉష్ణోగ్రత (అంచనా)

6-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	39	27
తెనాలి	38	26
నరసరావుపేట	39	26
బాపట్ల	38	27
రెంటచింతల	40	26



కృష్ణా పశ్చిమ డెల్టాలో అధ్వానంగా మారిన కాల్వ కట్ట

కాల్వల నిర్వహణకు.. కాసులు కావాలి!

- ఖరీఫ్-2025-26 సీజన్‌కు గడ్డు కాలం..
- మరమ్మతులకు కాల్వల ఎదురు చూపులు
- నీటితీరువా వసూలు కాక.. నిధులు లేక
- ప్రభుత్వం ఆదుకుంటేనే బాగయ్యేది
- రైతుల నుంచి పన్ను వసూలు రూ. 33 కోట్లే
- సాగర్ కుడి కాల్వల పరిధిలో 355 అత్యవసర పనుల గుర్తింపు
- గత ఐదేళ్లలో ఒక్క పనీ జరగక రైతుల అవస్థలు

ఖరీఫ్-2025-26 సీజన్‌కు రాష్ట్రంలోని కాల్వల మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్నాయి. అత్యవసర మరమ్మతుల కింద ఓఅండ్‌ఎం(ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్) నిధులు ఆయా డెల్టాలకు ఏటా మంజూరు చేయడం పరిపాటి. అయితే ఈసారి రైతుల నుంచి పన్నుల వసూళ్లు అంతంతమాత్రంగా ఉండడంతో ఈ నిధులకు ఇబ్బంది ఏర్పడింది. రాష్ట్రం మొత్తం మీద రూ. 142 కోట్ల విలువైన కాల్వల పనులు ప్రభుత్వం ఇచ్చే చల్లని కబురు కోసం ఎదురు చూస్తున్నాయి. గత వైసీపీ పాలనలో ఒక్క కాల్వకూ గుప్పెడు మట్టి పోసిందిలేదు. గండ్లు పూడ్చింది లేదు. పూడిక తీసిన పాపాన పోలేదు. దీంతో ప్రస్తుతం చివరి భూములకు చుక్కనీరు అందడం గగనమైంది.

తెనాలి, మే 5, (ఆంధ్రజ్యోతి): కృష్ణా డెల్టా, సాగర్ ఆయకట్టు పరిధిలో కాల్వల మరమ్మతులు చేసేందుకు సమయం ఆసన్నమయింది. సాధారణంగా ఏటా రైతులు చెల్లించే నీటి తీరువా నుంచి ఈ పనులకు నీటిపారుదల శాఖ నిధులు సమకూర్చుకుంటుంది. నీటి తీరువాలో 80 శాతం వాటాగా ఇరిగేషన్‌కే ప్రభుత్వం అందిస్తుంది. అయితే ఈ ఏడాది పన్నుల వసూళ్లకు సంబంధించి డిమాండ్‌లో కేవలం రూ.33 కోట్లే వసూలవడం.. పనుల విషయంలో అయోమయానికి కారణమైంది. అయితే నీటిపారుదల శాఖ మాత్రం ఓఅండ్‌ఎం పనుల కోసం రూ.142 కోట్ల విలువైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది. ఈ నెలలోనే ఈ ప్రతిపాదనలపై కడా(కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) సమావేశం నిర్వహించడం, పనులను ఆమోదించడం జరిగిపోయాయి. అయితే నిధులే సమస్యగా ఉండటంతో నీటిపారుదల శాఖ దీనిపై ప్రభుత్వానికి లేఖ రాసింది. అప్పటి నుంచి ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించక పోవడంతో ఇటు నీటిపారుదల శాఖ, సాగునీటి సంఘాల్లో, అటు రైతుల్లో ఆందోళన పెరిగిపోతోంది.

నిధుల కోసం ఎదురు చూపులు..

కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ సాగునీటి సంఘాలను తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు పెట్టి సంఘాల కమిటీలను అధికారికంగా ఎన్నుకునేలా చేసింది. సంఘాలు అత్యవసర పనులు ఎక్కడెక్కడ.. ఏమేమి చేయాలనేది గుర్తించాయి. రాష్ట్రంలోని సాగునీటి కాల్వలు, డ్రెయిన్‌ల అత్యవసర మరమ్మతుల కోసం కృష్ణా డెల్టా పరిధిలో రూ.50 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపితే, మైనర్ ఇరిగేషన్(చెరువులు) కింద రూ.55 కోట్లు, సాగర్ ఆయకట్టు కింద రూ. 37 కోట్లు, నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ మొత్తాలకు సంబంధించి ప్రభుత్వం నిధులు సమకూర్చాల్సి ఉంది.



గోవిందాపురం మేజర్ కాలువలో పెరిగిన కంప చెట్లు

మరో రెండు నెలలే సమయం..

ప్రస్తుతం కృష్ణా డెల్టాలో ప్రస్తుతం తాగు నీటి కోసం చెరువులు నింపుకునేందుకు కాల్వలకు నీటిని విడుదల చేశారు. నిన్నటితో వాటిని కూడా ఆపాల్సి ఉంటే, మరో రెండు రోజులు కాల్వల్లో నీరు ప్రవహించే పరిస్థితి ఉంది. నీటిని కట్టేసిన వెంటనే కాల్వల పనులు వేగవంతం చేస్తేనే సకాలంలో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. అంటే ఖరీఫ్ సీజన్ కోసం జూలై 10 నుంచి కాల్వలకు తిరిగి నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఇక 2 నెలలు మాత్రమే సమయం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ రెండు రోజుల్లో నిధులు మంజూరు చేయగలిగితే గండ్లు పడటానికి సిద్ధంగా ఉన్న కాల్వల కట్టల మరమ్మతులు చేసే అవకాశం ఉంటుంది. ఈ ఐదేళ్లలో పంట పండడం గగనమైపోయిన చివరి భూముల రైతులు ఈసారయినా తిండిగింజలు పండించుకునేందుకు అవకాశం ఉంటుంది.

355 పనులకు.. రూ.19.28 కోట్ల ప్రతిపాదనలు

సాగర్ కుడి కాల్వ పరిధిలో వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి, మాచర్ల డివిజన్‌లలో అత్యవసర మరమ్మతులకు సంబంధించి 355 పనులను ఇరిగేషన్ శాఖ గుర్తించింది. ఈ పనులు చేపట్టేందుకు రూ 19.28 కోట్ల అంచనా వ్యయం సిద్ధం చేశారు. ఈ నిధులతో కాల్వల్లో పూడిక తీత, కంపచెట్లు, జమ్ము, తూటుకాడ తొలగింపు పనులు చేపడుతారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని 38 పనులకు రూ 2.17 కోట్లు, గురజాల నియోజకవర్గ పరిధిలో 31 పనులకు రూ 2.17 కోట్లు, సత్తెనపల్లి నియోజకవర్గంలో 46 పను లకు రూ 2.34 కోట్లు, పెదకూరపాడు నియోజకవర్గంలో 36 పనులకు రూ.2.16 కోట్లు, తాడికొండ నియోజకవర్గంలో 34 పనులకు రూ 2 కోట్లు, నరసరావుపేట నియోజకవర్గంలో 51 పనులకు రూ 2.30 కోట్లు, చిలకలూరిపేట నియోజకవర్గంలో పరిధిలో 29 పనులకు రూ 1.45 కోట్లు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 25 పనులు రూ 1.49 కోట్లు, వినుకొండ నియోజకవర్గం పరిధిలో 54 పనులకు వ్యయం రూ.2.70 కోట్లు, దర్శి నియోజకవర్గంలో 5 పనులకు వ్యయం రూ.20.48 లక్షలు, అద్దంకి నియోజకవర్గంలో 6 పనులకు రూ.26.56 లక్షలుగా అంచనాలు రూపొందించి, జలవనరుల శాఖ నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.



నరసరావుపేట : షట్టరు లేని తూము

నీటి తీరువాపై నిర్లక్ష్యం..

సాగర్ కాల్వల్లో మరమ్మతులకు ఇవ్వాల్సిన నీటి తీరువా నిధులను దారి మళ్లించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కింది. నీటి తీరువా వసూలు చేయడంలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రైతులు ఏటా చెల్లించే నీటి శిస్తు ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలకు 5 శాతం, ఇతర కేటాయింపులు పోగా.. 80 శాతం నిధులను మైనర్, మేజర్ ఇరిగేషన్లకు కేటాయించాలి. నీటి తీరువాకు సంబంధించిన నిధులను కాడా సాగు నీటి సంఘాల వారీగా కేటాయించాల్సి ఉంది. ఇందులో 10 శాతం పరిపాలనకు. 15 శాతం డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14 శాతం ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇంకా నిధులు చేరకపోవడంతో మరమ్మతుల నిర్వహణలో కూడా చేతులెత్తేసే పరిస్థితులు నెలకొన్నాయి. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా రూ.20 కోట్లు నుంచి రూ. 21 కోట్లు వస్తుందని అంచానా. రైతులు చెల్లించే నీటి తీరువాపై కాల్వల మరమ్మతులు ఆధారపడి ఉంటాయి. ప్రభుత్వం ఇచ్చే నిధుల మాట ఎలా ఉన్నా.. తాము చెల్లించే నీటి తీరువా నిధులైనా కేటాయించి అత్యవసర మరమ్మతులైనా చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పనులు మొదలు పెట్టమన్నాం..

డెల్టా పరిధిలో కాల్వలకు నీరు ఆపిన వెంటనే చేయాల్సిన అత్యవసర పనులు మొదలు పెట్టమని నీటి సంఘాలకు ఇప్పటికే ఆదేశాలిచ్చాం. టెండర్ల పనులను కూడా చేయమని చెప్పాం. ఎక్కడా జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతుల నిధులకు ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించాం. తప్పకుండా నిధులు మంజూరవుతాయి.. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు.

- బానోతు రాంబాబు, సీఈ, నీటిపారుదల శాఖ, కృష్ణా డెల్టా విభాగం, విజయవాడ

కిడ్నాప్ కలకలం

- ఆర్థిక లావాదేవీలే కారణం
- నిర్బంధించి ప్రామిసరీ నోట్లపై సంతకాలు
- టీడీపీ నేత సహా ఏడుగురిపై కిడ్నాప్ కేసు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేయడమే గాక.. అతనిని నిర్బంధించి, ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేయించుకున్న ఘటన ఆదివారం అర్ధరాత్రి వెలుగులోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు కేసు నమోదు చేసి, పలువురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో టీడీపీ మహిళా కార్పొరేటర్ భర్త ఉండటం గమనార్హం. మొత్తం ఏడుగురిపై అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. దేవాపురానికి చెందిన హరిబాబు.. బృందావన్ గార్డెన్స్‌కు చెందిన కాండ్రు శ్రీనివాసరావు గతంలో విజయవాడ సమీపంలో రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారు. దానికి సంబంధించి ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో విభేదాలున్నాయి. హరిబాబు తనకు రూ. 50 లక్షలు వరకు ఇవ్వాలని కాండ్రు శ్రీనివాసరావు వాదన. అయితే భూముల ధరలు పెరిగిన నేపథ్యంలో శ్రీనివాసరావే తనకు ఇవ్వాల్సి ఉంటుందని హరిబాబు అంటున్నాడు. గతంలో ఇదే విషయమై ఓసారి హరిబాబును ఇదే ముఠా కొట్టింది. అప్పట్లో అతను పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం హరిబాబు అరండల్‌పేటలోని ఓ ఫైనాన్షియర్ కార్యాలయానికి వెళ్తుండగా గోరంట్లకు చెందిన పురిమెట్ల అఖిల్, నర్రా అశోక్, ఉప్పరాజు వినయ్, మేదరమెట్ల జయేంద్ర అనే నలుగురు యువకులు కారులో వచ్చి కిడ్నాప్ చేశారు. ఇది గమనించిన ఓ యువకుడు కారు నంబరు ఫొటో తీశాడు. ఈ విషయం స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. హరిబాబును చినపలకలూరు సమీపంలోని ఓ గోశాలలో నిర్బంధించారు. అంతలో అక్కడకు వచ్చిన కాండ్రు శ్రీనివాసరావు, మానం శ్రీనివాసరావు కూడా అతనిపై దాడి చేసి, ప్రామిసరీ నోట్లపై సంతకాలు తీసుకున్నారు. అనంతరం హరిబాబును వదిలివేయడంతో అరండల్‌పేట పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. బృందావన్‌గార్డెన్స్‌కు చెందిన టీడీపీ నేత, కార్పొరేటర్ భర్త మానం శ్రీనివాసరావు, కాండ్రు శ్రీనివాసరావుతో పాటు కొందరు వ్యక్తులు తనను కిడ్నాప్ చేసినట్లు హరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో పోలీసులు రెండు కార్లు, ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆయా డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ కేసులో ఓ న్యాయవాది పేరు కూడా వచ్చింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం వారికి నోటీస్ జారీ చేసి పంపారు. అయితే ఇద్దరూ టీడీపీకి చెందిన వారే కావడంతో రాజీపడినట్లు తెలిసింది.



160 ఏళ్ల నాటి కొమ్మమూరు కాలువపై వంతెన

వంతెన.. ఇక అంతేనా?

నత్తనడకన కొమ్మమూరు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం

- వైసీపీ హయాంలో ఆర్భాటంగా శంకుస్థాపన
- నిధుల కొరతతో.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- పది శాతం పనులు మాత్రమే పూర్తి

పొన్నూరుటౌన్, మే 5: గుంటూరు - చీరాల ప్రధాన రహదారిలో చేబ్రోలు వద్ద కొమ్మమూరు కాలువపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతోంది. 2023 ఆగస్టులో అప్పటి వైసీపీ పాలకులు బ్రిడ్జి నిర్మాణానికి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. ఎన్డీబీ నిధులు రూ.42.75 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించారు. ఇది జరిగి రెండేళ్లు కావస్తున్నా కాంట్రాక్టు సంస్థ నిర్వాకంతో కేవలం 10 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

160 ఏళ్ల నాటి చారిత్రాత్మక వంతెన

గుంటూరు నుంచి పొన్నూరు, బాపట్ల, చీరాల ప్రాంతాలను కలిపే ప్రధాన రహదారి జీబీసీ రోడ్డుపై చేబ్రోలు వద్ద కొమ్మమూరు కాలువ(బకింగ్ హామ్ కాలువ) ఉంది. 1865 లో ఈ కాలువపై వంతెన నిర్మాణం జరిపారు. 160 ఏళ్లగా రవాణాకు ఉపయోగపడిన ఈ వంతెన.. శిథిల స్థితికి చేరుకుంది. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలే కాకుండా కృష్ణా జిల్లాలో పలు ప్రాంతాలకు రాకపోకలు సాగించాలంటే ఈ వంతెనే కీలకం. గతంలో కొమ్మమూరు కాల్వలో విజయవాడ నుంచి పూర్వపు మద్రాసు రాష్ట్రం వరకు జల రవాణా సాగేది. 2014-19 లో ఎన్డీయే ప్రభుత్వం జల రవాణాపై ఆసక్తి చూపి, కొమ్మమూరు కాలువ ఆధునికీకరణకు ప్రతిపాదించింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం జల రవాణాకు అనుకూలంగా ఈ కాలువపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు జరగాలని ప్రతిపాదనలు సిద్ధం చేసి, కేంద్ర జలవనరుల శాఖ అనుమతుల కోసం పంపింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వంతెన పనులు అటకెక్కించింది. వంతెన నిర్మాణంపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ రావడంతో 2023లో నాటి పాలకులు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారు. నిధులు లేమితోనే కాంట్రాక్టర్ నిర్మాణ పనులకు వెనుకంజ వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల ముందు పనులు చేస్తే బిల్లులు రావనే ఉద్దేశంతో పనులు నిలిపివేసినట్లు సమాచారం.

నిర్మాణం సాగేనా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించారు. సుమారు నాలుగు కోట్ల విలువ కలిగిన 20 పైలింగ్ పనులను పూర్తి చేశారు. బ్రిడ్జి వాల్స్ నిర్మాణం కోసం ఓ వైపు రహదారిని తవ్వారు. అయితే కాంట్రాక్టు పొందిన సంస్థ స్థానికంగా ఉండక పోవడం.. చిన్న స్థాయి సిబ్బందిపై పనులు వదలి వేయడం అనుభవ రాహిత్య కారణంగా బ్రిడ్జి నిర్మాణ పనులకు శాపంగా మారాయి. బ్రిడ్జి వాల్స్ కోసం తవ్విన ప్రాంతంలో ప్రధాన రహదారి కోతకు గురవుతూ ప్రమాద కరంగా మారింది. కాంట్రాక్టు నిర్మాణ సంస్థకు 2 నెలలు మాత్రమే గడువు ఉంది. 90 శాతం పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికి కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంగా ఉందనే విమర్శలు ఉన్నాయి.



కోతకు గురైన రహదారి



పైలింగ్ దశలోనే ఆగిన వంతెన నిర్మాణం

గుంటూరు అభివృద్ధికి కృషి చేయండి

నగర మేయర్ నానీకి సీఎం సూచన

గుంటూరు, మే 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర అభివృద్ధికి కృషి చేసి, ప్రజల మన్నన పొందాలని గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని)కి ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. మేయర్‌గా ఎంపికైన సందర్భంగా కోవెలమూడి సీఎం చంద్రబాబు నాయుడిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్ అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంకు స్వామివారి ప్రతిమను బహూకరించారు. నానీని అభినందించిన సీఎం చంద్రబాబు.. తనదైన మార్కుతో పనిచేయాలని, పార్టీకి మంచిపేరు తీసుకురావాలని సూచించారు.



సీఎం చంద్రబాబుకు స్వామివారి ప్రతిమను అందజేస్తున్న మేయర్ నాని



ప్రజాదర్బార్‌కు పోటెత్తిన అర్జీదారులు

61వ రోజు వినతులు స్వీకరించిన మంత్రి లోకేశ్

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ స్పెషల్ హైటెక్ 2+2 పుష్ బ్యాక్ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 10న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 11న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని.. రాత్రి అక్కడే బస చేసి 12న పౌర్ణమి రోజున అరుణాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అదే రోజున అరుణచలేశ్వరుని దర్శించుకొని సాయంత్రం బయల్దేరి 13న ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందని తెలిపారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. టికెట్ ధర రూ. 2,420 మాత్రమేనని, అదనపు సమాచారం కోసం 73828 97459, 73828 96403 సంప్రదించాలని తెలిపారు.

ఆరోగ్య శాఖలో కలకలం

- జీవో నంబరు 143కు వ్యతిరేకంగా బదిలీలు
- 23 మందికి సమన్లు, నేడు, రేపు విచారణ

6

ఆదర్శ గ్రామాల ప్రకటనలో అలసత్వం

- చేస్తే 100 శాతం కేంద్రం నిధులు వచ్చే అవకాశం
- గ్రామాల అభివృద్ధి ప్రణాళికల ఆమోదం పెండింగ్
- సత్వరమే డీఎల్‌సీసీ మీటింగ్‌లు పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు

ఎస్ఆర్ఎంకు ఎక్సలెంట్ ప్లేస్‌మెంట్ అవార్డు


కేంద్రమంత్రి రాజ్‌భూషణ్ చేతుల మీదుగా అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ వివేకానందన్

మంగళగిరి సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూని వర్సిటీకి మరో ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం లభించింది. ఆసియా టుడే సంస్థ 15వ అంతర్జాతీయ విద్యా సదస్సును ఆదివారం సాయంత్రం న్యూఢిల్లీలో నిర్వహించింది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల ప్లేస్‌మెంట్ గణాంకాలను పరిశీలించి, బెస్ట్ ప్లేస్‌మెంట్ టైటిల్‌ను ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ప్రకటించింది. గరిష్ఠంగా రూ.50 లక్షల వార్షిక వేతనంతో కూడిన ప్లేస్‌మెంట్ కైవసం చేసుకోవడమే కాకుండా వంద శాతం ప్లేస్‌మెంట్ రికార్డును వర్సిటీ సొంతం చేసుకుంది. సగటున రూ.9.38 లక్షల వార్షిక వేతనాలు విద్యార్థులకు లభించేలా శిక్షణ అందించింది. ఇంజినీరింగ్ విద్యార్థులకే కాకుండా బీకాం, బీబీఏ, ఎంబీఏ, ఎంటెక్ విద్యార్థులు సైతం సగటున రూ.31 లక్షల వార్షిక వేతనం కింద ఉద్యోగాలు సాధించారు. ఎస్ఆర్ఎం కార్పొరేట్ రిలేషన్స్ అండ్ కెరీర్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ వివేకానందన్.. కేంద్ర జలశక్తి మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి, ఫిజి రిపబ్లిక్ హైకమిషన్ కౌన్సిలర్ నీలేష్ రోనిల్, ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా వివేకానందను అభినందించారు.

ఒంగోలు జాతి పరిరక్షణకే బల ప్రదర్శన పోటీలు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్(చేబ్రోలు)మే 5 : ఒంగోలు జాతి ఎడ్ల పరిరక్షణకే జాతీయస్థాయి ఎడ్ల పందేలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. వడ్లమూడిలో ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ వృషభ రాజాల బల ప్రదర్శన పోటీలు సోమవారం ఐదవ రోజుకు చేరుకున్నాయి. న్యూ కేటగిరి విభాగంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 13 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. 1,400 కిలోల బండను లాగి హోరాహోరీగా తలపడ్డాయి. ఎడ్ల పందేల ప్రాంగణం జన జాతరను తలపించింది. 5వ రోజు ఎమ్మెల్యే


ఎడ్ల పెంపకం దార్లకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ క్రిస్టీనా తదితరులు

ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రైతులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేసి, అనంతరం హెనీ క్రిస్టీనా మాట్లాడారు. రైతులను ప్రోత్సహించే విధంగా బల ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఒంగోలు జాతి పరిక్షరక్షణకు ఈ పోటీలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామన్నారు. నేటి యువత ఒంగోలు జాతి ఎడ్ల విశిష్టతను గుర్తించి, ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. సంగం పాలక వర్గ సభ్యులు, పలువురు ప్రముఖులు పోటీలను వీక్షించారు.

ప్రజాదర్బార్‌కు పోటెత్తిన అర్జీదారులు

● 61వ రోజు వినతులు స్వీకరించిన మంత్రి లోకేశ్

తాడేపల్లి (ఉండవల్లి), మే 5, (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ సోమవారంతో 61వ రోజుకు చేరుకుంది. తమ సమస్యలు విన్నవించేందుకు వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున అర్జీదారులు ఉండవల్లిలోని మంత్రి లోకేశ్ నివాసానికి తరలివచ్చారు. అందరిని ఆప్యాయంగా పలుకరిస్తూ వారి నుండి అర్జీలు స్వీకరించి, త్వరితగతిన పరిష్కారం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పలు అర్జీలకు సంబంధించి అప్పటికప్పుడే పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.


వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

వైసీపీ హయాంలో భూమి అన్యాక్రాంతం చేశారు

వైసీపీ హయాంలో ఇళ్ల స్థలాల పేరుతో తమ 34 సెంట్ల భూమిని అధికారులు అన్యాక్రాంతం చేశారని, విచారించి తగు న్యాయం చేయాలని పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామానికి చెందిన పడాల రాములు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తమకున్న ఏకైక ఆధారాన్ని రక్షించాలని కోరగా పరిశీలించి తగు న్యాయం చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని అంబేడ్కర్ యూనివర్సిటీలో తన భర్త పని చేస్తూ.. కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడని, కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని చిలకపాలెం గ్రామానికి చెందిన డి.రేవతి మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. పరిశీలించి న్యాయం చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుని, సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని సమైక్య యూత్ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. శాఖపరమైన పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయని తెలిపారు.బీఎస్సీ నర్సింగ్ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని ఒంగోలు పట్టణం, మామిడిపాలేనికి చెందిన మౌనిక మంత్రికి విజ్ఞప్తి చేసింది. పుట్టుకతోనే దివ్యాంగుడైన తన కుమారుడికి పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని పోరంకికి చెందిన ఐ.వరప్రసాద్ విన్నవించారు. గత వైసీపీ హయాంలో ఎన్టీఆర్ జిల్లా కవులూరులో తనకు నివేశన స్థలం మంజూరు చేసి, ఇంటి పట్టా ఇచ్చారని, కానీ, ఈ రోజు వరకు స్థలాన్ని చూపించలేదని జక్కంపూడికి చెందిన అన్నమ రాజు ముత్యాలు అర్జీ సమర్పించారు. 2017-18లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థు లకు న్యాయం చేయాలని ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్వాలిఫైడ్ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. కడప, రేణిగుంట మధ్య జాతీయ రహదారి 716 విస్తరణలో భాగంగా తన ఇంటిని అధికారులు సేకరించారని, అయితే ఇంటి నిర్మాణానికి మా త్రమే నష్టరి హారం ఇచ్చి.. స్థలానికి ఇవ్వకుండా వైసీపీ హ యాంలోని భూ సేకరణ అధికారులు వేధిస్తు న్నారని తిరుపతి జిల్లా, కరకంబాడికి చెందిన సుబ్రహ్మణ్యం మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో పరిశీలించి న్యాయం చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. కాగా అర్జీలు ఇచ్చేందుకు పలువురు దివ్యాంగులు రాగా లోకేశ్ స్వ యంగా వారి దగ్గరకే వెళ్లి వినతిపత్రాలు స్వీకరించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.


దివ్యాంగుడి నుంచి వినతిపత్రం స్వీకరించి మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

ఆరోగ్య శాఖలో కలకలం

జీవో నంబరు 143కు వ్యతిరేకంగా బదిలీలు
23 మందికి సమన్లు.. నేడు, రేపు విచారణ

గుంటూరు సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో కలకలం రేగింది. గుంటూరు రీజినల్ డైరెక్టర్ పరిధి లోని 23 మంది ఉద్యోగులకు సమన్లు జారీ అయ్యాయి. మంగళ, బుధవారాల్లో ఆర్డీ కార్యాలయంలో జరగనున్న విచారణకు హాజరు కావాలని అందులో పొందుపరిచారు. జీఓ నంబరు 143కి విరుద్ధంగా బదిలీలు, డిప్యూటేషన్లు జరిగినట్లు తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మలినేని భానుమూర్తి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆర్డీ కార్యాలయంలో కొందరు అధికారులు అక్రమ బదిలీలకు తెరలేపడం వివాదాస్పదమైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ నేతల పలుకుబడితో ఆయా పోస్టుల్లోకి వచ్చిన అధికారులు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి.

అన్నీ ఆయనే..

సదరు జీఓ ప్రకారం ఒకే క్యాడర్ లో ఇద్దరు ఉద్యోగులు ఉంటేనే బదిలీ చేయాలి. ఆర్డీ కార్యాలయం అధికారులు ఆ నిబంధనను పక్కన పెట్టేశారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల వద్ద పెద్ద మొత్తంలో పుచ్చుకొని ఒకే క్యాడర్ కేవలం ఒక్కరు ఉన్నా కూడా తాత్కాలిక బదిలీ) చేశారు. ఆర్డీ కార్యాల యంలో ఉన్న అధికారిణిని పక్కన పెట్టేసి కొందరు ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కృష్ణా జిల్లాకు చెందిన వైసీపీ ముఖ్య నేత కొడాలి నాని సిఫార్సుతో ఆర్డీ కార్యాలయంలో తిష్ట వేసిన అధికారి కనుసన్నల్లోనే ఇలాంటి అక్రమాలు ఎక్కువగా జరిగినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మారినా.. అదే అధికారి కార్యాలయంలో సర్వం తానై నడుపుతుండడంతో మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రస్థాయి అధికారికి విచారణ బాధ్యతలు అప్పగించారు.

స్కార్పియో ఢీకొని.. ద్విచక్ర వాహనదారుడి మృతి

కర్లపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): స్కార్పియో ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన కర్లపాలెం మండలం యాజలి సెంటర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై రవీంద్ర కథనం ప్రకారం పిట్టలవానిపాలెం మండలం అలకాపురానికి చెందిన కుసపూడి కృష్ణంరాజు (59) ద్విచక్ర వాహనంపై కర్లపాలెం వైపు వస్తున్నాడు. కర్లపాలెం వైపు నుంచి చందోలు వెళ్తున్న స్కార్పియో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణంరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రవీంద్ర ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కొడుకు నాగ మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. స్కార్పియో వాహనాన్ని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ : కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు (విద్య) మే 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూడా లన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 23,279 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 3,883 మంది విద్యార్థులు హాజరు అవుతారని చెప్పారు. ప్రశ్నపత్రాల భద్రత, పరీక్ష కేంద్రాలకు పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాలకు ఆర్టీసీ అధికారులు బస్సులను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేసి, ఏఎన్ఎంను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ భార్గవతేజ, ఆర్ఐఓ జుబేర్, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డీఆర్ఓ ఎన్.ఎస్.కే ఖాజావలి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి


ఆదర్శ గ్రామాల ప్రకటనలో అలసత్వం

● చేస్తే 100 శాతం కేంద్రం నిధులు వచ్చే అవకాశం
● గ్రామాల అభివృద్ధి ప్రణాళికల ఆమోదం పెండింగ్
● సత్వరమే డీఎల్‌సీసీ మీటింగ్‌లు పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన(పీఎంఏజీవై) పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆదర్శ గ్రామాల ప్రకటనలో జాప్యం జరుగుతోంది. దీని వల్ల కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన గ్యాప్ ఫిల్లింగ్(జీఎఫ్) ఫండ్స్ రావడం లేదు. మూడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్స్(వీడీపీలు) సిద్ధమైనప్పటికీ వాటిని జిల్లా స్థాయి కన్వర్జన్స్ కమిటీ(డీఎల్‌సీసీ) ఆమోదించి ప్రకటించాల్సి ఉంది. కారణాలేమైనా.. సమావేశాలు సక్రమంగా జరగకపోతుండడంతో.. ఈ పథకం నుంచి ఎక్కువ మొత్తంలో గ్రామ పంచాయతీలకు నిధులు తెచ్చుకొనే పరిస్థితి లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో తక్షణమే మూడు జిల్లాల కలెక్టర్లు కన్వర్జన్స్ కమిటీల మీటింగ్‌లు ఏర్పాటు చేసి, వీడీపీలు ఆమోదించి ఆదర్శ గ్రామాలను ప్రకటించాలని, తద్వారా అదనపు నిధులు కేంద్రం నుంచి తెచ్చుకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

వీడీపీల ఆమోదం పెండింగ్..

తరతరాలుగా విద్య, సంపదలో వెనకబడిపోయిన ఎస్సీలను పైకి తీసుకురావడానికి పీఎంఏజీవై పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను వారికి వర్తింపజేయడంతో పాటు గ్యాప్ ఫిల్లింగ్ ఫండ్స్‌ని విడుదల చేస్తుంది. ఒక్కో గ్రామానికి రూ. 20 లక్షల వరకు నిధులు తెచ్చుకొనే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుంది. యూపీఏ ప్రభుత్వ హయాంలోనే ఈ స్కీమ్ ప్రారంభమైనప్పటికీ ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఈ స్కీమ్ కింద గుంటూరు జిల్లాలో 39 గ్రామాలను ఎంపిక చేయగా వీడీపీలను అన్నింటికి తయారు చేశారు. వీడీపీలు ఆమోదం విషయానికి వచ్చేసరికి 15 ఆమోదించి 24 పెండింగ్‌లో పెట్టారు. దీంతో ఆదర్శ గ్రామాలను సంపూర్ణంగా ప్రకటించలేకపోయారు. ఇదేవిధంగా పల్నాడు జిల్లాలో 21 గ్రామాలను ఎంపిక చేసి వీడీపీలను తయారు చేశారు. అయితే ఇప్పటి వరకు ఎనిమిదింటిని మాత్రమే ప్రకటరించారు. 13 గ్రామాలను పెండింగ్‌లో పెట్టారు. బాపట్ల జిల్లాలో అత్యధికంగా 58 గ్రామాలను ఎంపిక చేసి వీడీపీలను 46 గ్రామాలకు సిద్ధం చేశారు. వాటిల్లో 15 మాత్రమే ఆమోదించి 43 పెండింగ్‌లో ఉంచారు. వీటిల్లో తొమ్మిది గ్రామాలను మాత్రమే ఆదర్శవంతమైనవిగా ప్రకటించారు.



పీఎంఏజీవై లోగో

118 గ్రామాలకు..రూ.23.60 కోట్లు

కాగా గుంటూరులో మూడు గ్రామాలకు సంబంధించి గ్యాప్ ఫిల్లింగ్ ఫండ్ కింద రూ. 80 లక్షలు విడుదల కాగా ఇప్పటివరకు వాటిని ఖర్చు చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో తక్షణమే జడ్పీ సీఈవో/పంచాయతీ రాజ్ ఈఈలకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌ని ప్రభుత్వం ఆదేశించింది. మూడు జిల్లాలు కలిపి 118 గ్రామాలను ఆదర్శంగా ప్రకటించుకోగలిగితే రూ.23.60 కోట్ల నిధులను కేంద్రం నుంచి తెచ్చుకొని గ్యాప్ ఫిల్లింగ్ వర్కులకు ఉపయోగించుకొనే అవకాశం ఉంటుంది. ఇందుకు కేంద్రం జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లు రూపొందించి జిల్లా స్థాయి కన్వర్జన్స్ మీటింగ్‌ల్లో ఆమోదం తీసుకొని ఆఖరుగా వాటిని ఆదర్శ గ్రామాలుగా ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించి నిధులు విడుదల చేయిస్తుంది.

పని ఒత్తిడి తట్టుకోలేక ఏఎన్ఎం ఆత్మహత్య


మల్లోలు కోటేశ్వరమ్మ(ఫైల్)

రేపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడి తట్టుకోలేక చనిపోతున్నట్లు లేఖ రాసి పట్టణంలోని 5వ వార్డు సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్ఎం మల్లోలు కోటేశ్వరమ్మ(27) ఆదివారం రాత్రి ఉరివేసుకుంది. సమాచారం మేరకు.. పట్టణ సీఐ మల్లికార్జున సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి, మీడియాకు వివరా లు వెల్లడించారు. లంకేవానిదిబ్బ గ్రామానికి చెందిన సింగోకు సుశీల, బుల్లికోటయ్య మూడో కుమర్తె కోటేశ్వరమ్మకు మూడేళ్ల క్రితం నిజాంపట్నం మండలం దిండి గ్రామానికి చెందిన మల్లోలు గోపితో వివాహం జరిగింది. భర్త గోపి నిజాంపట్నంలో ప్రయివేటు టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్యాభర్తలు 5వ వార్డులో నివాసం ఉంటున్నారు. కోటేశ్వరమ్మ స్థానిక సచివాలయంలోనే ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ లేఖ రాసి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. సోమవారం తెల్లవారుజామున భర్త గోపి చూసేసరికి భార్య ఫ్యాన్‌కు వేలాడుతూ.. కనబడటంతో చుట్టుపక్కల వారిని పిలిచి, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ మల్లికార్జునరావు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కోటేశ్వరమ్మ తల్లి సింగోకు సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలికి ఒక కుమార్తె ఉంది.

ఏఎన్ఎంలు ధైర్యంగా ఉండాలి

గుంటూరు సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎం కోటేశ్వరమ్మ పని ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాదల అప్పారావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. త్వరలోనే పని ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉందని, ఏఎన్ఎంలు ధైర్యంగా ఉండాలని సూచించారు. అధికారులు మరీ తట్టుకోలేని ఒత్తిడి తెస్తే.. జిల్లా కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. కోటేశ్వరమ్మలా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. యూనియన్ నాయకులు.. కోటేశ్వరమ్మ ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

● మహిళా కండక్టర్‌పై దాడి కేసులో రెండేళ్లు జైలు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మామ హత్య కేసులో నిందితుడైన అల్లుడికి యావజ్జీవ కారాగార శిక్ష, అదేవిధంగా మహిళా కండక్టర్‌పై దాడి కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు, వెయ్యి జరిమాన విధిస్తూ సోమవారం ఆయా కోర్టులు తీర్పులిచ్చాయి. కేసుల వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకుమానువారి వీధిలో ఓ మహిళ తన భర్త నుండి దూరంగా.. తన పుట్టింటిలో నివాసం ఉంటోంది. ఆమె భర్త కృష్ణాజిల్లా రామవరప్పాడుకు చెందిన కుర్రా శివ నాగభూషణం 2017 జులై 30న రాత్రి ఆమెపై కత్తితో దాడికి యత్నించాడు. ఆమె తండ్రి అడ్డురాగా అతనికి తీవ్ర గా యాలయ్యాయి. అతన్ని హాస్పిటల్లో చేర్పించగా.. చికిత్స పొందుతూ మరణిం చాడు. సీఐ శ్రీకాంత్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ రెండవ అదనపు జిల్లా జడ్జి న్యాయస్థానంలో ఏపీపీ బర్కత్ అలీ వాదనలు వినిపించారు. న్యాయమూర్తి వై.నాగరాజు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో విధుల్లో ఉన్న మహిళా కండక్టర్‌ను దుర్భాషలాడి, దాడికి పాల్పడిన దండు రామనాథరెడ్డి అనే వ్యక్తి పై అప్పటి మేడికొండూరు ఎస్సై కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. 5వ జేఎఫ్‌సీఎం న్యాయస్థానంలో జరిగిన విచారణలో నిందితుడు నేరానికి పాల్పడినట్లు నిర్ధారించి.. న్యాయమూర్తి కోలార్ లతా.. రామనాథరెడ్డికి రెండేళ్ల కారాగార శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు.

హత్య కేసులో భర్త అరెస్టు

దాచేపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త ఉల్లేరు అప్పారావును పొందుగుల బోర్డర్ చెక్‌పోస్టు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు దాచేపల్లి సీఐ భాస్కరరావు సోమవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఈనెల 1వ తేదీన ఉల్లేరు అప్పారావు భార్య దుర్గపై అనుమానంతో నడికుడి శివారులోని అంబుజా సిమెంట్స్ భూముల్లోకి తీసుకెళ్లి ఆమె తలపై కొట్టి వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలపాలైన దుర్గ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ కేసులో నిందితుడు అప్పారావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు వివరించారు.



నిందితుడు అప్పారావును అరెస్టు చూపుతున్న దాచేపల్లి సీఐ భాస్కరరావు, పోలీసు కానిస్టేబుళ్లు

బౌద్ధ స్థూపాన్ని పరిశీలించిన రేపల్లె ఆర్డీవో

భట్టిప్రోలు (కొల్లూరు), మే 5 (ఆంధ్రజ్యోతి) : బౌద్ధ స్థూపాన్ని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి సందర్శించారు. భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, మే 12వ తేదీన బుద్ధ జయంతి వేడుకలను ప్రభుత్వం నిర్వహించాలని ఇటీవల గ్రీవెన్స్‌లో దళిత బుద్ధిస్టులు కలెక్టర్ కె.వెంకటమురళీకి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన ఆర్డీవో, జిల్లా పంచాయతీ అధికారి బౌద్ధ స్థూపాన్ని పరిశీలించి ఇక్కడ చేయాల్సిన అభివృద్ధి పనులపై నివేదిక అందించాలని సూచించడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం బౌద్ధ స్థూపాన్ని పరిశీలించి స్థానిక అధికారులతో అక్కడ చేపట్టవలసిన అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. 12న బుద్ధ జయంతి నిర్వహించాలని బుద్ధిస్టులు కోరగా, కలెక్టర్‌తో చర్చించి వేడుకల నిర్వహణపై ప్రకటన చేస్తామని ఆర్డీవో అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కిరణ్మయి, ఆది ఆంధ్ర నవ బుద్ధిస్టు సొసైటీ అధ్యక్షుడు, న్యాయవాది దోవ రమేష్ రాంజీ, టీడీపీ నాయకులు నీల జోగిబాబు, న్యాయవాది సాంబశివరావు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 513.90 అడుగులు ఉంది. ఇది 138.38 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

1,33,870 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,38,347 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,33,870 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 44,723 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13800
334	9500	13200	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	10000	12400	సింజెంటా బ్యాడిగి 5531	---	---
341	10000	13300	దేవనూరుడీలక్స్	10000	12600
4884	10000	11200	ఆర్మూరు	9800	11200
సూపర్10	---	---	తాలుకాయలు	4500	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ తదితరులు

అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

● మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 23 ఫిర్యాదులు తీసుకున్నారు. అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కా రం చేయ గలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరు వేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ ఎస్‌కు 33 ఫిర్యాదులు అందాయని వాటిని నిర్దేశిత గడువు లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మేజర్ డ్రైన్‌లలో వ్యర్థాలు రాకుండా మెష్‌లు ఏర్పాటు చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో వార్డ్ సచివాలయాల వారీగా మేజర్ డ్రైన్‌లో కలిసే కల్వర్ట్ ప్రాంతంలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు రాకుండా మెష్‌లు ఏర్పాటు చేయాలని కమిష నర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన డ్రైన్లలో వ్యర్థాలు నిలిచి వర్షాకాలం తీవ్ర సమస్యగా మారుతుందని, అంతర్గత డ్రైన్ల నుంచి వ్యర్థాలు నేరుగా మేజర్ లేదా అవుట్ ఫాల్ డ్రైన్లోకి రాకుం డా మెష్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వార్డ్ సచివాలయాల వారీగా 2 రోజుల్లో ఎన్ని ప్రాంతాల్లో మెష్‌లు ఏర్పాటు చేయాలో నివేదిక ఇవ్వాల న్నారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాస రావు, సీహెచ్ శ్రీనివాస్, డీసీపీ సూరజ్‌కుమార్, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

పిన్ పాయింట్ ప్రోగ్రాం మేరకు చెత్త సేకరణ చేయాలి

నగర పరిధిలో పారిశుధ్య కార్మికులు పిన్ పాయింట్ ప్రోగ్రాం మేరకు ఇళ్ల నుంచి నూరుశాతం చెత్త సేకరణ చేయాలని కమిషనర్ ఆదేశించారు. సోమవారం ఆయన బ్రాడీపేట, అశోక్‌నగర్, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధి త అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

నగరాభివృద్ధికి పటిష్టంగా పనులు చేపట్టాలి

● కమిషనర్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, మే 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరాభివృద్ధికి కట్టుదిట్టంగా పనులు చేపట్టాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ పులి శ్రీనివాసులుతో ఎమ్మెల్యే నసీర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గుంటూరు నగరంలో శానిటేషన్, రోడ్లు అన్న క్యాంటీన్లు వంటి వివిధ పనులపై చర్చించారు. శంకర్ విలాస్ బ్రిడ్జి శంకుస్థాపన అనంతరం ఏర్పడే ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలోని పట్నంబజార్, మాయాబజార్, ఆటోనగర్ ప్రాంతాల్లో సులభ్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు అవసరం ఉందని, దీనిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించిన అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని కమిషనర్ తెలిపారు.

ఈ-పోస్‌లో నమోదు చేస్తేనే రాష్ట్రానికి ఎరువులు

● వ్యవసాయ శాఖ జేడీ కృపాదాస్

గుంటూరు సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు విక్రయించిన ఎరువుల వివరాలను వ్యాపారులు సకాలంలో ఈ-పోస్‌లో నమోదు చేస్తే నే రాష్ట్రానికి కేంద్రం నుంచి కొత్త కేటాయింపులు జరుగుతాయని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వీడీవీ కృపాదాస్ అన్నారు. సోమవారం గుంటూరులో జరిగిన ఈ-పోస్ యంత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అమ్మకాల వివరాలు ఐఎఫ్ఎంఎస్ పోర్టల్ నందు నమోదు చేయకపోతే రాష్ట్రంలో అధి కంగా ఎరువుల నిల్వలు ఉన్నట్లు కేంద్రం భావించి కొత్త కేటా యింపులు జరుపదని, వ్యాపారులపై కూడా తనిఖీ అధికారులు 6-ఏ కేసులు నమోదు చేసే అవకాశం ఉందని కృపాదాస్ అన్నారు. కాబట్టి వ్యాపారులు ఇక మీదట ఎరువుల అమ్మకాల వివరాలు ఈ-పోస్ యంత్రంలో క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరదీప్ ఫాస్ఫేట్ లిమిటెడ్ (పీపీఎల్) కోరమాం డల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 276 ఈ-పోస్ యంత్రాలను గుంటూరు జిల్లాలోని ఎరువుల వ్యాపారులకు అందజేశారు. కార్యక్ర మంలో జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, ఏడీఏలు జయ దేవ్‌రాజన్, తోటకూర శ్రీనివాసరావు, ఏవోలు, ఏపీ ఎరువుల డీలర్ల సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, పీపీఎల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల డీలర్లకు ఈ-పోస్ యంత్రాలు అందజేస్తున్న జేడీఏలు కృపాదాస్, నున్న వెంకటేశ్వర్లు తదితరులు

ప్రాంతీయ, జిల్లా కేంద్ర గ్రంథాలయాలకు పుస్తకాలు

● ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ వితరణ

గుంటూరు (విద్య), మే 5 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ప్రాంతీయ, జిల్లా గ్రంథాలయంలో ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యో గుల కోసం సోమవారం పుస్తకాలు పంపిణీ చేశారు. డీఎస్సీ, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, కాని స్టేబుల్, ఎన్‌టీపీసీ గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే వారి కోసం రూ.30 వేల విలువైన పుస్తకాలను అందజేశారని లైబ్రేరియన్ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్య క్రమంలో అసోసియేషన్ ఛైర్మన్ గుర్రం మురళీమోహన్, గ్రంథాలయ విశ్రాంత అధికారి అక్కినేని అచ్చమాంబ, డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ దీక్షితులు, గ్రంథాలయ సొసైటీ అధ్య క్షుడు జీ శివప్రసాద్, ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ నరసింహారావు, జ్యోతి శ్రీనివాస్, డాక్టర్ చంద్ర రాధికారాణి, డాక్టర్ రాయపాటి మమత, జిల్లా లైబ్రరీ కార్యదర్శి వి. సుబ్బ రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 197 అర్జీలు

● పరిష్కరించాలంటూ ఆదేశాలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ భార్గవ్‌తేజ తదితరులు

గుంటూరు(తూర్పు), మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 197 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం గంగరాజు, ఆర్డీవో శ్రీనివాస రావుతో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడు తూ అసమగ్ర సమాచారంతో పిటిషన్ పరిష్కరిస్తే సదరు అధికారిపై చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. జేసీ భార్గవతేజ్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో మెడికల్ అండ్ హెల్త్, స్టాంపుల శాఖల్లో తక్కువ స్థాయి సం తృప్తిని ప్రదర్శిస్తుందని అన్నారు. అర్జీల పరిష్కారంలో సమయపాలన పాటి స్తూ, నాణ్యతగా పరిష్కరించేనపుడే సంతృప్తి స్థాయి పెరుగుతుందని తెలి పారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్డీఏ, డ్వామా, హౌసింగ్ పీడీలు విజయలక్ష్మి, శంకర్, ప్రసాదు, డీపీవో నాగసాయికుమార్, డీఎస్‌వో కోమలి పద్మ, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ విజయ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ అనుమతి లేకుండా నివాసాల మధ్య ఏర్పాటు చేసిన పొట్టేళ్ల చర్మాల ప్రాసెసింగ్ యూనిట్‌ని తక్షణమే తొలగించాలని స్థానిక పాత గుం టూరు, జామియానగర్ గొట్టాలరోడ్డుకు చెందిన స్థానికులు అర్జీ అందజేశా రు. దీనిపై మార్చి 3న నగర పాలక కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రసాదు, రియాజ్, వహీద్ ఉన్నారు.

● పాత గుంటూరు, సుద్దపల్లి డొంకలో సర్వేనెంబర్ 998/బీ3ఏలో ఉన్న నిషేధిత భూములను జాబితా నుంచి తొలగించాలని ఆ ప్రాంత ప్రజలు వినతిపత్రం అందజేశారు.

● కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.35 వేలుగా నిర్ణయించాలని, కనీస వేతన బోర్డు తక్షణమే నియమించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు అర్జీ అందజేశారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని కోరుతూ శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. చర్చ లు జరిగేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కృషి చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీనియర్ న్యాయవాది వైకే, చిలుకా చంద్రశేఖర్, నళినికాంత్, వేల్పూరి నరసింహారావు తదితరులు ఉన్నారు.

ఏళ్ల తరబడి పింఛన్ కోసం ఎదురుచూపు

పుట్టుకతోనే శారీరక, మానసిక వైకల్యంతో బాధపడుతున్న నా కుమార్తె సయ్యద్ అస్మాకు వైకల్య పెన్షన్ మంజూరు చేయాలని స్థానిక చుట్టుగుంట, 77వ సచివాలయ పరిధిలో నివాసముంటున్న సయ్యద్ కరీమా కలెక్టర్‌ను వేడుకున్నారు. నూరుశాతం వైకల్యం ఉన్నట్టు వైద్యులు ధ్రువీకరించి సదరన్ సర్టిఫికెట్ ఉన్నప్పటికి, వేలిముద్రలు, ఐరిష్‌కు అస్మా సహకరించకపోవడంతో పెన్షన్ రావడంలేదని చెప్పారు. ఒకవైపు భర్త చనిపోవడం, మరోవైపు 21 ఏళ్ల కుమార్తె మంచానికే పరిమితం అవ్వడంతో కుటుంబ పోషణ భారమైం దని ఆవేదన వ్యక్తం చేశారు.



తాలూకా కేంద్రం వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం

● ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు(విద్య), మే 5 (ఆంధ్రజ్యోతి): జీవో 117 రద్దు చేసి పాఠశాల విద్యారంగా న్ని పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ తాలూకా కేంద్రం వద్ద ఏపీటీఎఫ్ గుంటూరు జోన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కన్వీనర్ పి.నాగశివన్నారాయణ అధ్యక్షతన ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శన జరిగింది. ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం జీవో 117 రద్దు చేసి ఉన్నత పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులు వెనక్కి తీసుకువస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని ఆరోపించారు. తాజాగా 1, 2 తరగతులు కూడా ఉన్నత పాఠశాలలోకి కలపడం మోసం చేయడమేనన్నారు. ఈ నెల 9న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే ఈనెల 14న విజయవాడలో మహా ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఏపీఎస్టీవో జిల్లా అధ్యక్షుడు, జిల్లా జేఏసీ ఛైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలిద్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ నియమించి, కరువు భత్యం 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శన లో ఏపీ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎంఎన్ మూర్తి, లక్ష్మీ నారాయణ, కె.రమేష్, దాస్, రమాదేవి, వెంకటేశ్వర్లు, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, కిషోర్, భారతి, విజయశ్రీ, భాస్కర్, కుటుంబరావు, బాలరాజు, సుబ్బా రావు, జహంగీర్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జితో కలెక్టర్ మర్యాదపూర్వక భేటీ

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే జిల్లా జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన బీ.సాయి కల్యాణ్ చక్రవర్తిని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మర్యాదపూ ర్వకంగా కలిశారు. సోమ వారం సాయంత్రం జడ్జి కార్యాలయానికి వెళ్లిన కలెక్టర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు.



జిల్లా జడ్జి బీ సాయికల్యాణ్ చక్రవర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ నాగలక్ష్మి

రక్తకన్నీరు నాగభూషణం పుస్తకావిష్కరణ

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): నాటక రంగం నుంచి ఆవిర్భవించిన మహానటుడు నాగభూషణం అని, ఆయన కళలకు, కళాకారులకు, సమాజానికి చేసిన సేవ నిస్వార్థమైందని అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకుడు లంకా సూర్యనారాయణ అన్నారు. నటుడు చుండి నాగభూషణం గురించి తొలిసారిగా ప్రచురించిన పుస్తకాన్ని సోమవారం నాగభూషణం వర్ధంతి సందర్భంగా సూర్యనారాయణ ఆవిష్కరించారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయంలో 'రక్తకన్నీరు నాగభూషణం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత సూపరింటెండెంట్ గుమ్మడి సీతారామయ్య, జీఎస్టీ సూపరింటెండెంట్ మిక్కిలినేని శ్రీనివాస్, రజీ పబ్లికేషన్స్ ప్రతినిధి వేగి దుర్గారావు, గ్రంథాలయ పాలకురాలు సుహాసిని ప్రసంగించారు. ఈ పుస్తకాన్ని జర్నలిస్టు ఉదయగిరి ఫయాజ్ రచించారని, ఒక అభిమాని ప్రచురించారని తెలిపారు.

ఒత్తిడిని అధిగమిస్తే మెరుగైన ఫలితాలు : జితేంద్ర

గుంటూరు (విద్య), మే 5 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడిని అధిగమిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సీహెచ్ జితేంద్ర అన్నారు. సోమవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఒత్తిడిని అధిగమించడంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఫార్మసీ విద్యార్థులు ఒత్తిడికి గల కారణాలను తెలుసుకొని అందుకు నివారణ చర్యలు అన్వేషించాలని డాక్టర్ జితేంద్ర సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి ఎస్.మధుసూదనరావు, ఫార్మడీ డైరెక్టర్ పీ.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఏ.ప్రత్యూష, ఫార్మకాలజీ హెచ్‌వోడీ డీ.బ్రహ్మ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ నాగభూషణం పాల్గొన్నారు.

కోర్టు ఉద్యోగి ఆత్మహత్య



సురేంద్ర మృతదేహం

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్‌కు చెందిన కోర్టు ఉద్యోగి గూడూరు సురేంద్ర (48) బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సురేంద్ర జిల్లా కోర్టులోని కాపీ సెక్షన్‌లో పని చేస్తుంటాడు. ఆదివారం రాత్రి బీపీ టాబ్లెట్లు వేసుకొని పడుకున్నాడు. తెల్లవారిన తర్వాత చూడగా రెండంతస్థుల బిల్డింగ్‌పై నుంచి పక్క ఇంటి పైన పడి మృతి చెంది ఉన్నాడు. సురేంద్ర ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతికి దారి తీసిన కారణాలు తెలియరాలేదు. కుమారుడు సాయి మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీఈ ప్రవేశాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

● మండల స్థాయిలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలి

● కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు (విద్య), మే 5(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకా రం ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ మైందని దీనిపై మండల స్థాయి నుంచి విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. విద్యాహక్కు చట్టంపై సోమవారం కలెక్టరేట్‌లో పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం నిర్దేశించిన విధంగా, ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో, 2025-26 విద్యా సంవత్సరానికి, 1వ తరగతి ఉచిత ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈనెల రెండు నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని, మండల స్థాయిలో ఎంఈవోలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానం పై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 19లోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి ప్రైవే టు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో అనాథలు, హెచ్ఐవీ, వారికి ఐదు శాతం, ఎస్సీలకు పది, ఎస్టీలకు నాలుగు, వెనుకబడిన వర్గాల వారికి ఆరు శాతం సీట్లు లభిస్తాయన్నారు. మొదటి విడత సీట్ల కేటాయింపు లాటరీ ద్వారా 29న ప్రకటిస్తారని తెలియజేశారు. సమావేశంలో జేసీ భార్గవ తేజ, డీఈవో సీవీ రేణుక తదితరులు పాల్గొన్నారు.



విద్యాహక్కు చట్టం పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవతేజ డీఈవో సీవీ రేణుక తదితరులు

రేపు జిల్లా స్థాయి చెస్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వికాస్‌నగర్ స్టెప్పింగ్ స్టోన్స్ పాఠశాలలో ఈనెల 7న అండర్-7, బాలబాలికల విభాగంలో జిల్లా స్థాయి చెస్ ఎంపికలు జరుగుతాయని టోర్నమెంట్ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో విజేతలైన వారు ఈనెల 9 నుంచి గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. 2018 సంవత్సరం తరువాత పుట్టిన వారు ఈ పోటీలకు అర్హులన్నారు. వివరాలకు 90631 42105 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు తీవ్ర అన్యాయం : నేతాజీ

గుంటూరు సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నేతాజీ ఆరోపించారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నేతాజీ మాట్లాడుతూ 2022 వరకు రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమానంగా ఎన్‌హెచ్ఎంలోని అన్ని క్యాడర్లకు ఎంటీఎస్ అమలు చేశారని అన్నారు. 15 ఏళ్లుగా అమలైన ఈ విధానానికి గత వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు తమనంపల్లి ప్రవళిక, జిల్లా కార్యదర్శి లింగరాజు, వైస్ ప్రెసిడెంట్ వనజ తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ సర్టిఫికెట్ స్కీమ్‌తో ఎల్‌టీపీలకు నష్టం

● లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్

గుంటూరు కార్పొరేషన్, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొద్ది నెలల క్రితం నూతనంగా సెల్ఫ్ సర్టిఫికెట్ స్కీం 2025 నిబంధనలు తీసుకువచ్చి ఎల్‌టీపీల పొట్టకొడుతుందని లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ సతీష్ వాపోయారు. సోమవారం అరండల్‌పేటలోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 300 చదరపు మీటర్ల లోపు స్థలాలకు సంబంధించిన భవన నిర్మాణ అనుమతుల విషయంలో ఏమైన తప్పులు జరిగితే అందుకు బాధ్యులుగా ప్లాన్ ఇచ్చిన ఎల్‌టీపీలను ఇబ్బందులకు గురిచేసే విధంగా ఎస్‌సీఎస్ స్కీం ఉందన్నారు. ప్రభు త్వం తీసుకువచ్చిన ఈ నిబంధనలతో ఎల్‌టీపీలు కొద్ది నెలలుగా ప్లాన్‌లు దరఖాస్తు చేసుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థి తి నెలకొందన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఎస్‌సీఎస్ స్కీం కింద తీసుకువచ్చిన నిబంధనలను సడలించాలని కోరారు. ఈ సమా వేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైనేని లక్ష్మణ్, నగర ఛైర్మన్ పరమహంస, నగర అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్, నాగశ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల గాత్రం

గుంటూరు(తూర్పు), మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం మాస్టర్స్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన చిన్నారుల గాత్రం అలరించింది. కార్యక్రమంలో చిన్నారులు గాత్రం, కీ బోర్డు, గిటార్, వయొలిన్ వంటి అనేక వాయిద్యాలతో నిర్వహించిన కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది. తొలుత కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహ కార్యదర్శి ఊటు కూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

పేదలను ఆదుకోవడం మా బాధ్యత

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 5(ఆంధ్రజ్యోతి): పేదలకు అత్యుత్తమ వైద్యం అందించడం బాధ్యతగా భావిస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని నెహ్రూ నగర్ 8వ లైన్‌కు చెందిన బట్టు శ్రీరాములు కుటుంబానికి సోమవారం ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సుమారు రెండు కోట్ల రూపాయల వరకు సీఎం రిలీఫ్ ఫండ్ అందిం చామని తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అండగా నిలిచేందుకు ముందుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీరాములు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే నసీర్‌కు రుణపడి ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో చట్టు కనకారావు, ఏల్చూరి కిరణ్, కోట పిచ్చిరెడ్డి, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఉజ్వల భవిష్యత్తు

కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరుచుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని వసంతరాయపురంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరి గిన సమర టెక్స్‌టైల్స్ శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మహిళలు తాము ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యం సాధించాల ని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అశోక్, నాయకులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



ప్రజలు, పార్టీ కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చి హాస్టల్లో ఉండే విద్యార్థినులు, మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా తనను సంప్రదించవచ్చునని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఆమె ప్రజా గ్రీవెన్స్ నిర్వహించి, వినతులు స్వీకరించారు. అనంతరం వివిధ డివిజన్ల పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే కార్యక్ర మాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, డివిజన్లలో సమస్యలను ఎప్పటికప్పుడు అధి కారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. మహిళలకు ఎన్డీఏ ప్రభుత్వం అండగా నిలబడుతుందని, ఆదివారం బ్రాడీపేటలోని ఓ హాస్టల్‌లో జరిగిన ఘటన తన దృష్టికి వచ్చిన వెంటనే పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, ఇటువంటి దుర్మార్గమైన పనులను ప్రభుత్వం ప్రోత్సహించదని, కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మహిళల కోసం సఖి నివాస్‌ను ఇప్పటికే ప్రారంభించామని, దీనిని మహిళలందరూ ఉపయోగించుకోవాలన్నారు.

మద్యం దొంగలకు మొదలైన కౌంట్‌డౌన్ : మన్నవ



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, మే 5(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న మద్యం కుంభ కోణంలోని పాత్రదారులకు కౌంట్‌డౌన్ మొదలైందని, ఇకపై వారు తప్పించుకోలేరని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ స్పష్టం చేశారు. ఆ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మద్యం కుంభకోణంలో హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా ముందస్తు బెయిలుకు నిరాకరించడంతో తాడేపల్లి ప్యాలెస్ వర్గాలు భయంతో వణికిపోతున్నాయని అన్నారు. జగన్ మాజీ పీఏ ధనుంజయ్‌రెడ్డి, పీ కృష్ణమోహన్‌రెడ్డి, జగన్ సతీమణి భారతి ఆర్థిక వ్యవహారాలు చూసే గోవిందప్ప ఏ క్షణంలోనైనా అరెస్టు కావొచ్చునని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో మద్య నిషేధం మాటున, దొంగల ముఠా చేసిన లిక్కర్ స్కామ్ ముసుగు నేడు తొలగిందని, రాష్ట్రంలో జరిగిన మద్యం తయారీ, సరఫరా, విక్రయాలు అన్నింటికీ కర్త, కర్మ, క్రియ జగన్‌రెడ్డేనని అన్నారు. జగన్ తన వారితో నాసిరకం మద్యం తయారు చేయించి, అధిక ధరకు అమ్మి, ఐదేళ్లలో 35 వేల మం ది పేదల ప్రాణాలు తీశాడని మండిపడ్డారు. మద్యం స్కామ్‌లో జగన్ ఖచ్చితంగా జైలుకు పోవడం ఖాయమని మోహనకృష్ణ స్పష్టం చేశారు.

యువతకు ఆధ్యాత్మికత అవసరం : ఆతుకూరి

గుంటూరు, మే 5(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో యువత ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. తెనాలికి చెందిన ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ హనుమంతరావు, సతీమణి నగ రాజకుమారి దంపతులు 70 రోజుల పాటు కాలి నడకన ప్రయాణం చేసి పుణ్యక్షేత్రాలైన కాశీ, ప్రయాగ దర్శించుకున్న సందర్భంగా ఆ దంపతులను జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో సత్కా రించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు టీఎల్‌వీ వీరాంజనేయులు, ఆతుకూరి నగేష్‌కుమార్, వీవీ నాగిరెడ్డి, రామ సుబ్బారావు, కొప్పురా వూరి ఏడుకొండలు, గార్లపాటి సత్యనారాయణ, షరాబు కృష్ణమూర్తి, అమర శ్రీనివాసరావు, కొత్తమాసు శ్రీనివాసరావు, డీవీ రవికుమార్, చిరంజీవి తదితరులున్నారు.



డాక్టర్ హనుమంతరావు దంపతులను సత్కరిస్తున్న ఆతుకూరి ఆంజనేయులు, చాంబర్ సభ్యులు

ప్రపంచ మానవాళికి దిక్సూచి కార్ల్ మార్క్స్

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల

గుంటూరు(తూర్పు), మే 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవాళికి దిక్సూచి మహనీయుడు కార్ల్ మార్క్స్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ కొని యాడారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో కార్ల్ మార్క్స్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు, చల్లా మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

● సమాజంలో దోపిడీ పీడనలున్నంత వరకు ప్రపంచ పీడిత వర్గాలకు మార్గదర్శి మార్క్సిజమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం మార్క్స్ జయంతి సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈమని అప్పారావు, కె.నళినీకాంత్, బి.ముత్యాల రావు, వై కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పారాహుషార్

300 గ్రాములు మించితే..

మాంసాహారుల్లో చికెన్‌ను ఇష్టపడని వారు ఉండరు. కొందరికైతే ఆదివారం వచ్చిందంటే చికెన్ లేనిదే ముద్ద దిగదు. అయితే చికెన్ తినడం వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని ఓ తాజా అధ్యయనంలో తేలింది. ఆ వివరాలు తెలుసుకుందాం. వయసు, ఆరోగ్యం, వైద్య చరిత్ర వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, 19 ఏళ్ల పాటు, నాలుగు వేల మందిపై ఇటలీ పరిశోధకులు చేసిన అధ్యయనంలో పలు విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. వారానికి 300 గ్రాముల కోళ్ల ఉత్పత్తులు తినడం వల్ల జీర్ణశయాంతర క్యాన్సర్ ముప్పు రెండింతలు ఎక్కువవుతుందని న్యూట్రియంట్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఆ అధ్యయనంలో వెల్లడైంది. ఈ ప్రమాదం మహిళల కంటే పురుషుల్లోనే ఎక్కువని పరిశోధకులు తేల్చారు. అలాగే వారానికి 300 గ్రాములు, అంతకంటే ఎక్కువగా కోళ్ల ఉత్పత్తులు తినే వారిలో మరణాల ముప్పు కూడా 27 శాతం అధికమని గుర్తించారు. చికెన్‌లో మన శరీరానికి అవసరమైన ప్రొటీన్, విటమిన్ బి12, కోలిన్ వంటివి పుష్కలంగా ఉన్నప్పటికీ, చికెన్‌ను వారానికి 100 గ్రాములకు మించకుండా మితంగా తినడం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.




హెల్త్ న్యూస్

టైప్5 మధుమేహం గురించి విన్నారా?

రక్తంలో ఇన్సులిన్ మోతాదు పెరిగితే, దాన్ని టైప్2 మధుమేహంగా నిర్థారిస్తారు. మరి ఇన్సులిన్ తగ్గితే? రక్తంలో సరిపడా ఇన్సులిన్ లేని పరిస్థితి, టైప్5 మధుమేహంగా అధికారిక గుర్తింపు పొందింది. మరిన్ని వివరాలు...

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కొన్ని దశాబ్దాల క్రితమే పోషకాహార లోపంతో సంబంధమున్న మధుమేహాన్ని గుర్తించడం జరిగింది. ఈ రకమైన మధుమేహం తాజాగా అధికారిక గుర్తింపును దక్కించుకుంది. అంతర్జాతీయ డయాబెటిస్ ఫెడరేషన్, ఈ మధుమేహాన్ని టైప్5 మధుమేహంగా వర్గీకరించింది. 70 ఏళ్ల క్రితమే ఈ మధుమేహాన్ని గుర్తించినప్పటికీ ప్రపంచ ఆరోగ్య చర్చల్లో దీన్ని నిర్లక్ష్యం చేయడం జరిగింది. 20వ శతాబ్దంలోనే వెలుగులోకొచ్చిన ఈ పరిస్థితిని టైప్1 లేదా టైప్2 మధుమేహంగా తప్పుగా వర్గీకరించారు. ఈ అసాధారణమైన మధుమేహం, ప్రపంచవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికాల్లోని పోషకాహారలోపంతో బాధపడే యువతను పట్టి పీడిస్తున్నట్టు, 160 దేశాల్లోని 250 జాతీయ డయాబెటిక్ అసోసియేషన్లు అంచనా వేసినట్టు అంతర్జాతీయ డయాబెటిస్ ఫెడరేషన్ పేర్కొంటోంది. దీర్ఘ కాలం పాటు పోషకాహార లోపంతో బాధపడే వారిలో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గి టైప్5 మధుమేహం పెరుగుతోంది. ప్రత్యేకించి కౌమార దశలో బయల్పడే ఈ మధుమేహానికి ఒక జన్యులోపమే కారణం. ఈ రకమైన జన్యు ఉత్పరివర్తనం తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వంశపారంపర్యంగా సంక్రమిస్తూ ఉంటుంది. అయితే టైప్5 మధుమేహానికి ఇటీవలే అధికారిక గుర్తింపు లభించింది కాబట్టి వ్యాధినిర్ధారణ, చికిత్సా విధానాలు ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి సంబంధించి చేపట్టిన పరిశోధన ఆధారంగా ఈ రుగ్మతకు సంబంధించి మరో రెండేళ్లలో మార్గదర్శకాలను అభివృద్ధి చేయనున్నట్టు అంతర్జాతీయ మధుమేహ ఫెడరేషన్ ప్రకటించింది.





ఉబ్బసం నుంచి ఉపశమనం

కీలెంచి వాత పెట్టాలనే సూత్రం ఉబ్బసానికి కూడా వర్తిస్తుంది. ఈ రుగ్మత ఉన్న ప్రతి ఒక్కరికీ ఒకే చికిత్స అందించడం సరి కాదు. ప్రేరేపించే అంశాలు, వయసు, తీవ్రతల ఆధారంగా తగిన చికిత్సా మార్గాన్ని ఎంచుకుంటే ఉబ్బసాన్ని అదుపు చేయడమే కాదు, దాన్నుంచి సమూలంగా విముక్తి పొందవచ్చు అంటున్నారు వైద్యులు.

ఉబ్బసాన్ని వ్యాధిగా పరిగణించకూడదు. దీన్నొక పరిస్థితిగానే భావించాలి. ఈ సమస్య చికిత్సకు లొంగడమే కాకుండా, సకాలంలో స్పందించి, తగిన చికిత్స తీసుకోగలిగితే దీన్నుంచి శాశ్వత విముక్తి కూడా పొందే వీలుంటుంది. నిజానికి ఉబ్బసం వ్యాధి, చికిత్స పట్ల ఉన్న అపోహలే వ్యాధి నియంత్రణకు అవరోధాలుగా మారుతున్నాయి. సమర్థమైన చికిత్స అందుబాటులో ఉన్నా, వ్యాధిని అదుపులో ఉంచే ముందు జాగ్రత్త చర్యల పట్ల అవగాహన లేకపోవడం వల్ల సమస్యను అదుపు చేయలేకపోతున్నాం. ఉబ్బసాన్ని ప్రేరేపించే కారకాలను నిర్లక్ష్యం చేయడం, పక్కదారి పట్టించే లక్షణాలకు స్వీయ చికిత్సలను ఆశ్రయించడం... ఇలా ఈ వ్యాధిని చేతులారా పెంచి పోషించుకుంటున్నాం!

గ్లోబల్ ఇనీషియేటివ్ ఆస్తమా అనే లాభాపేక్ష లేని అంతర్జాతీయ సంస్థ, ప్రతి ఏటా మే ఆరును ఆస్తమా దినంగా ప్రకటించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను చేపడుతూ ఉంటుంది.

లెక్కలేనన్ని కారణాలు

ఉబ్బసానికి వయసుతో సంబంధం లేదు. ఈ సమస్య ఎవరికైనా, ఎప్పుడైనా తలెత్తవచ్చు. సాధారణ అలర్జీ కూడా దీర్ఘకాలంలో ఉబ్బసానికి దారి తీయొచ్చు. ఈ పరిస్థితికి ఇంకొన్ని కారణాలు ఏవంటే...

- వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు
- వాతావరణ కాలుష్యం వల్ల రావొచ్చు
- జీవనశైలి, ఆహారశైలి మార్పులు రావొచ్చు
- కృత్రిమ పదార్థ రంగులు, రసాయనాల వల్ల తలెత్తవచ్చు
- ఫుడ్ అలర్జీ, డస్ట్ అలర్జీల వల్ల రావొచ్చు
- కొందరు పుట్టుకతోనే రావొచ్చు
- మరి కొందరికి బాల్యంలో తలెత్తవచ్చు
- జన్యు ఉత్పరివర్తనల వల్ల రావొచ్చు
- బొద్దింకలు, పూలపుప్పొడి వల్ల తలెత్తవచ్చు
- పరిశ్రమల నుంచి వెలువడే పొగల వల్ల రావొచ్చు

ఈ లక్షణాల మీద కన్నేసి...

దగ్గు, పిల్లికూతలు, ఆయాసం.. ఈ మూడు ఉబ్బసం ప్రధాన లక్షణాలు. కానీ ఇవే లక్షణాలు సాధారణ వైరల్ ఇన్‌ఫెక్షన్లలో కూడా కనిపిస్తాయి. కానీ అవి కొన్ని రోజులు వేధించి, తగ్గిపోతాయి. అలా కాకుండా పదే పదే అవే లక్షణాలు వేధిస్తూ ఉన్నా, ఒక రుతువులో మాత్రమే ఈ లక్షణాలు పెరుగుతున్నా ఉబ్బసంగా అనుమానించాలి. కొత్తగా బడికి వెళ్తున్న పిల్లల్లో ఇలాంటి లక్షణాలు ప్రతి నెలా కనిపించినప్పుడు, ఆ లక్షణాలను ప్రేరేపించే అంశాలు, కుటుంబ చరిత్ర, తీవ్రతల ఆధారంగా ఉబ్బసాన్ని నిర్ధారించుకోవాలి. అయితే రుతుపరమైన వైరల్ ఇన్‌ఫెక్షన్లలో కూడా ఇవే లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి కాబట్టి ఉబ్బసాన్ని నిర్ధారించుకోవడం కోసం కొన్ని పరీక్షలు చేయించుకోవలసి ఉంటుంది. పెద్దల్లో కూడా అకస్మాత్తుగా ఉబ్బసం తలెత్తుతుంది.

పరీక్షలున్నాయి

ఉబ్బసాన్ని నిర్ధారించడం తేలికే! స్పైరోమెట్రీ, పీక్ ఫ్లో మెషిన్ పరీక్షలతో ఉబ్బసం తీవ్రత తెలుస్తుంది. మందులతో ఉబ్బసం లక్షణాలు అదుపులోకి రావడాన్ని బట్టి కూడా సమస్యను ఉబ్బసంగా నిర్ధారించుకోవచ్చు. లక్షణాలు పగలు తక్కువగా సాయంత్రం, రాత్రి వేళ ఎక్కువగా ఉన్నప్పుడు కూడా ఉబ్బసంగా నిర్ధారించుకోవచ్చు. అలాగే కొందరికి అలర్జీ పరీక్షలు కూడా అవసరమవుతాయి. అలాగే అలర్జీ సంకేతాలు, లక్షణాలకు సంబంధించిన ప్రశ్నావళులను పూరించడం ద్వారా, కలిగి ఉన్న అలర్జీల పట్ల స్పష్టత ఏర్పరుచుకుని, ఉబ్బసానికే దారి తీసే అవకాశాలను కూడా అంచనా వేయవచ్చు. వైద్యులు, ఈ పరీక్షలన్నిటినీ ఉబ్బసం నిర్వహణ సాధనాలుగా పరిగణిస్తారు. అలాగే కొందరు పిల్లల్లో వ్యాయామం చేసినప్పుడు మాత్రమే ఉబ్బసం ప్రేరేపితమవుతూ ఉంటుంది. ఇలాంటి పిల్లల చేత వ్యాయామం చేయించి, పల్మొనరీ ఫంక్షన్ టెస్ట్ చేపట్టి ఉబ్బసంగా నిర్ధారించుకోవచ్చు.



ట్రిగ్గర్ కావొచ్చు!

కొందరికి ఐదు నిమిషాల ముందు వరకూ లేని ఆయాసం హఠాత్తుగా మొదలవుతుంది. భయపడినా, విపరీతమైన ఒత్తిడి, శారీరక శ్రమకు లోనైనా క్షణాల్లో ఉబ్బసం లక్షణాలు కనిపించి ఊపిరి ఆడనివ్వకుండా చేసేస్తాయి. ఇలాంటివాళ్లు ఇన్‌హేలర్స్ ఎప్పుడూ దగ్గర పెట్టుకోవాలి. క్రీడాకారులైతే ఆటకు ముందు వీటిని వాడితే, ఉబ్బసం వేధించకుండా ఉంటుంది.

ఇన్‌హేలర్స్ సురక్షితం

ఉబ్బసానికి ఉత్తమమైన చికిత్స నెబ్యులైజర్స్, ఇన్‌హేలర్స్, స్టిరాయిడ్స్. చాలామంది వీటిని వాడడానికి ఇష్టపడరు. వైద్యులు ఇన్‌హేలర్స్ సూచించినప్పుడు వేరే మందులను సూచించమని వైద్యులను ఒత్తిడి చేస్తారు. కానీ ఉబ్బసానికి ఇన్‌హేలర్స్ సురక్షితమైన చికిత్స. తీవ్రతను బట్టి కొందరికి స్టిరాయిడ్స్ కూడా అవసరం పడొచ్చు. ఈ రెండూ ఇతరత్రా దుష్ప్రభావాలు కలిగించకుండా నేరుగా ఊపిరితిత్తుల మీదే పనిచేస్తాయి.

అలాగే కొందర్లో పిల్లికూతలు, ఆయాసం లేకుండా కేవలం దగ్గుతోనే ఉబ్బసం బయల్పడవచ్చు. ఐదేళ్ల లోపు పిల్లల్లో పిల్లికూతల రూపంలో ఉబ్బసం బయటపడొచ్చు.

అలర్జీలున్నాయా?

గత రెండు దశాబ్దాల్లో మన దేశంలో ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోయాయి. ఇలా ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోయినప్పుడు మన శరీరం వ్యాధినిరోధకశక్తి స్పందన తీరు మారిపోతుంది. ఫలితంగా కొన్ని వాతావరణాలకు, భావోద్వేగాలకూ, పదార్థాలకూ శరీరం ప్రతికూలంగా స్పందించి, ఉబ్బసం లక్షణాలు వేధించడం మొదలుపెడతాయి. సాధారణంగా అలర్జీలన్నీ ఉబ్బసానికే దారి తీస్తాయని అనుకుంటూ ఉంటారు. కానీ ముక్కు నుంచి నీరు కారే అలర్జిక్ రైనైటిస్ లాంటి 40% నుంచి 50% అలర్జీలు మాత్రమే ఉబ్బసానికి దారి తీస్తాయి. మరీ ముఖ్యంగా పిల్లల్లో అలర్జీలు ఉబ్బసాలకు దారి తీసే అవకాశాలు ఎక్కువ. కానీ ఎక్కువ శాతం పిల్లల్లో అలర్జీ కారక ఉబ్బసం ఉన్నప్పటికీ, సరైన చికిత్సను అందించగలిగితే, వయసు పెరిగేకొద్దీ ఆ లక్షణాలన్నీ సమసిపోతూ ఉంటాయి.

చికిత్స ఇలా...

అకస్మాత్తుగా తీవ్ర ఉబ్బసం దాడి చేసినప్పుడు వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. ఆ సమయంలో నెబ్యులేజేషన్‌తో పాటు ఆక్సిజన్ కూడా అవసరమవుతుంది. ఇన్‌హేలర్స్, స్టిరాయిడ్స్ కూడా అవసరమవుతాయి. దీర్ఘకాల ఉబ్బసం ఉన్నవారు అలర్జీలను తగ్గించుకోవడం అవసరం. కొందరికి అగరబత్తీలు, సాంబ్రాణి వాసనలకు ఉబ్బసం లక్షణాలు వేధిస్తాయి. వీళ్లు మాస్కులు వాడుకోవాలి. స్వీట్లు తిన్నప్పుడు లక్షణాలు తీవ్రమైతే వాటికి దూరంగా ఉండాలి. చల్లని పదార్థాలు, కొన్ని రకాల పండ్లు, వంకాయ, గుడ్లు, నట్స్‌తో కూడా కొందర్లో ఉబ్బసం తలెత్తుతుంది. ఆ కారకాలను కనిపెట్టి వాటికి దూరంగా ఉండాలి. ఇన్‌హేలర్స్ వాడుకుంటే వాటికి అలవాటు పడిపోతాం అనే ఒక ప్రధాన అపోహ కూడా సర్వత్రా నాటుకుపోయింది. వీటిని ఉబ్బసం చివరి దశలోనే ఇన్‌హేలర్స్ వాడుకోవాలి అనుకుంటూ ఉంటారు. కానీ నిజానికి ఇవి వ్యాధి ప్రారంభంలో వాడుకోవలసినవి. మిల్లీగ్రాముల పరిమాణంలో ఔషధాన్ని కలిగి ఉండే ఇన్‌హేలర్స్ మాత్రల కంటే సున్నితమైనవి. ఇవి మాత్రల్లా రక్తంలో కలిసి శరీరమంతా ప్రవహించకుండా, నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి సమస్యను పరిష్కరిస్తాయి. పైగా వీటికి దుష్ప్రభావాలు ఉండవు. సమస్య కూడా వెంటనే పరిష్కారమవుతుంది. కాబట్టి ఇన్‌హేలర్స్ అన్ని విధాలా సురక్షితమైనవి.

డాక్టర్ పి. నవీన్ సారథి
కన్సల్టెంట్ పీడియాట్రిక్ పల్మొనాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్,
హైదరాబాద్.





పెద్దపేగు పదిలంగా

మన దేశంలో అత్యంత సాధారణ క్యాన్సర్లలో పెద్ద పేగు క్యాన్సర్ ఒకటిగా మారిపోయింది. జీర్ణకోశ సమస్యలను తలపించే పెద్ద పేగు క్యాన్సర్ చికిత్స పక్కదారి పట్టే ప్రమాదం ఉంది కాబట్టి అప్రమత్తతతో వ్యవహరించడం అవసరమంటున్నారు వైద్యులు.

గత ఐదేళ్ల కాలంలో పెద్ద పేగు క్యాన్సర్ ఉదంతాలు రెట్టింపయ్యాయి. మునుపు ఏడవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా పరిమితమైపోయిన ఈ క్యాన్సర్ తాజాగా మూడవ స్థానానికి ఎగబాకింది. ప్రత్యేకించి యువతలో ఈ క్యాన్సర్ పెరగడం ఆందోళన కలిగించే విషయం. మరీ ముఖ్యంగా ఈ క్యాన్సర్‌ను తొలి దశల్లోనే గుర్తించలేకపోవడం వల్ల వ్యాధి ముదిరి చికిత్స క్లిష్టమయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇందుకు కారణం, పెద్దపేగు క్యాన్సర్ లక్షణాలు పొట్ట, పేగుల్లో తలెత్తే సాధారణ సమస్యలను తలపించేలా ఉండడమే!

తప్పుదోవ పట్టించే లక్షణాలు

మలబద్ధకం: రోజుల తరబడి మలబద్ధకం వేధిస్తుంది. అయితే అడపాదడపా ఈ సమస్య సాధారణమే కాబట్టి ఎవరూ దీన్ని పెద్దగా పట్టించుకోరు. కానీ పెద్దపేగు క్యాన్సర్‌గా భావించరు

విరోచనాలు: ఈ లక్షణం కూడా అందర్లో అడపాదడపా కనిపిస్తూనే ఉంటుంది. కాబట్టి ఈ లక్షణాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు

మిశ్రమ సమస్య: కొన్ని రోజులు మలబద్ధకం, ఇంకొన్ని రోజులు విరోచనాలు వేధిస్తాయి. ఇలాంటి మిశ్రమ లక్షణాలు కూడా పెద్దపేగు క్యాన్సర్‌ను సూచిస్తాయి

మలంలో రక్తం: మలంలో రక్తం కనిపించడం కూడా పెద్దపేగు క్యాన్సర్ లక్షణమే!

మలవిసర్జనలో ఇబ్బంది: మలవిసర్జన సాఫీగా, సునాయాసంగా జరగకపోయినా పెద్దపేగు క్యాన్సర్‌గా అనుమానించాలి

అల్సరేటివ్ కొలైటిస్: ఈ సమస్య నిర్లక్ష్యానికి గురైనప్పుడు, అది పెద్దపేగు క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదం ఉంటుంది

బరువు/ఆకలి తగ్గడం: అకారణంగా శరీర బరువు, ఆకలి తగ్గుతున్నా పెద్దపేగు క్యాన్సర్‌గా అనుమానించాలి

వీరికి ముప్పు ఎక్కువ

- అధిక బరువు
- కుటుంబ చరిత్రలో పెద్దపేగు క్యాన్సర్
- అస్తవ్యస్థ ఆహార, జీవనశైలులు
- ఎక్కువగా రెడ్ మీట్ తినడం
- ధూమపానం, మద్యపానం
- వ్యాయామం లోపం
- ఎక్కువ గంటలు కదలకుండా పనిచేయడం
- బొగ్గుల మీద కాల్చిన చేపలు తినడం

నియంత్రణ చర్యలు ఇవే!

పెద్దపేగు క్యాన్సర్ నివారణ సులభమే! కొద్దిపాటి అప్రమత్తతతో, ముందు జాగ్రత్తలతో ఈ క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చు.

- బరువును అదుపులో ఉంచుకోవాలి
- ధూమపానం, మద్యపానం మానేయాలి
- వ్యాయామం చేస్తూ, శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి
- కుటుంబ చరిత్రలో పెద్దపేగు క్యాన్సర్ ఉన్నవాళ్లు 40 ఏళ్లు దాటిన వెంటనే, లేనివాళ్లు 50ఏళ్లు దాటగానే కొలనోస్కోపీ చేయించుకోవాలి
- ఒకసారి కొలనోస్కోపీలో క్యాన్సర్ లేదని నిర్థారణ అయినవాళ్లు అప్పటి నుంచి ప్రతి పదేళ్లకోసారి కొలనోస్కోపీ చేయించుకోవాలి
- రెడ్ మీట్, బొగ్గుల మీద కాల్చిన చేపలు తినడం మానేయాలి

వ్యాధి నిర్ధారణ ఇలా...

మలబద్ధకమైనా, విరోచనాలు అయినా 5 నుంచి 7 రోజులకు క్రమేపీ సర్దుకుంటాయి. పొట్ట, పేగులకు సంబంధించిన సాధారణ సమస్యలన్నీ తాత్కాలికంగానే వేధించి, తగ్గిపోతూ ఉంటాయి. ఇలా కాకుండా నెల, రెండు నెలల పాటు లక్షణాలు వేధిస్తూ ఉన్నా, బరువు తగ్గిపోతున్నా తప్పనిసరిగా వైద్యులను కలిసి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. రక్తపరీక్షలు, ట్యూమర్ మార్కర్లు, కొలనోస్కోపీలతో పెద్దపేగు క్యాన్సర్‌ను సులువుగా పసిగట్టవచ్చు. కొలనోస్కోపీతో ఒకటి, రెండు దశల్లోని కనిపెట్టవచ్చు. ఆ తర్వాత అవసరాన్ని బట్టి సిటి స్కాన్, సిటి కొలనోగ్రఫీలు చేసి, క్యాన్సర్ తీవ్రతను అంచనా వేయవచ్చు. శరీరంలోకి ఎలాంటి స్కోప్‌ను చొప్పించకుండానే పెద్దపేగు, పురీషనాళంలోని పాలిప్స్, పుండ్లు, క్యాన్సర్ గడ్డలను కనిపెట్టడంలో సిటి కొలనోగ్రఫీ బాగా తోడ్పడుతుంది. పెద్దపేగు క్యాన్సర్ ప్రారంభంలో చిన్న పాలిప్‌లా మొదలవుతుంది. కాబట్టి స్కాన్ సమయంలోనే వీటిని పసిగట్టి, తొలగించగలిగితే వ్యాధి ముదరకుండా చూసుకోవచ్చు.

చికిత్స సులువే!

పెద్దపేగుల్లో తలెత్తే క్యాన్సర్ ముందరి పాలిప్స్, కణుతులను ఎండోస్కోపీతో తొలగించుకోవచ్చు. ఈ చికిత్స రెండు, మూడు గంటల్లో పూర్తవుతుంది. తర్వాతి రోజే రోగి ఇంటికి వెళ్లిపోవచ్చు. క్యాన్సర్ మూడు, నాల్గవ దశలకు చేరుకున్నప్పుడు సర్జరీ చేయక తప్పదు. చివరి దశల్లో క్యాన్సర్ పెద్దపేగు నుంచి కాలేయం, ఎముకలు, ఊపిరితిత్తులకు వ్యాపించినప్పుడు సర్జరీ ముందు, తర్వాత కీమోథెరపీ, రేడియోథెరపీ అవసరమవుతుంది. తాజాగా రొబొటిక్ సర్జరీ కూడా అందుబాటులోకొచ్చింది. చిన్న కోతతో కొనసాగే ఈ సర్జరీతో రోగి తక్కువ కాలంలోనే కోలుకోగలుగుతాడు. సర్జరీ తదనంతరం దుష్ప్రభావాలు కూడా ఉండవు.

డాక్టర్ కృష్ణగోపాల్ ఎస్ భండారి
సీనియర్ కన్సల్టెంట్
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైదరాబాద్.



పెద్దపేగు ఆహారం

పెద్ద పేగు ఆరోగ్యం కోసం పీచు ఎక్కువగా ఉండే ఆహారం తినాలి. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. నూనెలో వేయించిన పదార్థాలు, పిజ్జాలు, బర్గర్లు లాంటి జంక్ ఫుడ్ తగ్గించాలి.



తెలుసుకుందాం

మెదడుకు పదును ఇలా...

మెదడు చురుగ్గా ఉంచుకున్నంత కాలం, మతిమరుపు సమస్యలు దరి చేరకుండా ఉంటాయి. మరీ ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వాళ్లు మెదడుకు వ్యాయామాన్ని అందిస్తూనే ఉండాలి. అందుకోసం....

రోజుకొక కొత్త విషయం: కొత్త సమాచారంతో మెదడుకు సవాలు విసురుతూ మెదడును చురుగ్గా ఉంచుకుంటూ ఉండాలి. కొత్త అభిరుచి ఏర్పరుచుకోవడం, కొత్త భాష నేర్చుకోవడం, కొత్త సంగీత వాయిద్యం సాధన చేయడం లాంటివన్నీ మెదడుకు వ్యాయామాలే! ఇవన్నీ చేయలేనివాళ్లు కొత్త వంటకం వండడం, కొత్త విషయాలను తెలుసుకోవడం లాంటివి చేయొచ్చు.

బ్రెయిన్ గేమ్స్, పజిల్స్: సుడొకు, పజిల్స్ పూరిస్తూ వాటిని నిరంతరం సాధన చేస్తూ ఉండాలి. ఈ ఆటల కోసం రోజుకు అరగంట కేటాయించడం వల్ల మెదడు చురుకుదనం పెరుగుతుంది. అయితే రోజూ ఒకే రకమైన బ్రెయిన్ గేమ్స్‌కు బదులుగా ఒక రోజు సుడొకు, ఒక రోజు పదవినోదం, మరొక రోజు అంకెల గారడీ లాంటివి ఆడుతూ ఉండాలి.

ధ్యానం: ధ్యానంతో మానసిక ప్రశాంతత దక్కడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని పరిశోధనల్లో తేలింది. క్రమం తప్పక ధ్యానం చేయడం వల్ల జ్ఞాపకశక్తితో సంబంధమున్న మెదడులోని హిప్పొపొటమస్ అనే ప్రదేశం బలపడుతుంది.

వాటం మార్పు: కుడి చేతి వాటం ఉన్న వాళ్లు ఎడమ చేతినీ, ఎడమ చేతి వాటం ఉన్న వాళ్లు కుడి చేతినీ వాడుకుంటూ ఉండాలి. బ్రష్‌తో పళ్లు తోముకోడానికీ, చీపురు పట్టుకుని ఊడ్చడానికీ, ఏదైనా అందుకోడానికీ, గరిట తిప్పడానికీ.. ఇలా తేలికపాటి పనుల కోసం చేతి వాటం మారుస్తూ ఉండడం వల్ల మెదడులోని రెండు అర్ధభాగాలూ చైతన్యమవుతాయి.

వ్యాయామం: వ్యాయామంతో మెదడు కూడా లాభపడుతుంది. ఏరోబిక్ వ్యాయామంతో మెదడుకు రక్తప్రసరణ మెరుగవుతుంది. నడక, ఈత, డాన్స్.. ఇవన్నీ మెదడును చురుగ్గా ఉంచుతాయి. కాబట్టి రోజుకు కనీసం 30 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి.

అనుబంధాలు: సంభాషణ, హాస్యం, అనుబంధాలు మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి. కాబట్టి స్నేహితులతో కాలక్షేపం చేయడం, కలిసి సినిమాలు చూడడం, చర్చలు జరపడం లాంటివి చేస్తూ ఉండాలి. సామాజిక సంబంధాలను పెంపొందించుకోవాలి.



పశ్చిమ డెల్టాకు 716 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మే 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెలాక్టు ప్రకాశం బ్యారేజి నుంచి 716 క్యూసెక్కుల నీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.9 అడుగుల నీటిమట్టం ఉండగా రేపల్లె కాల్వకు 100, తూర్పు కాల్వకు 34, నిజాంపట్నం కాల్వకు 50, కొమ్మమూరు కాల్వకు 329 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 1235 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,300, గరిష్ఠధర రూ.11,450, మోడల్‌ధర రూ.11,119 పలికాయి. కాయ కనిష్ఠధర రూ.10,300, గరిష్ఠధర రూ.11,450, మోడల్‌ధర రూ.11,150 పలికాయి.

రేపటి నుంచి యోగా శిక్షణ శిబిరం

మంగళగిరి సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం ఆవరణలో ఈ నెల 7వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని ప్రధాన యోగాచార్యులు పడమట రాధాకృష్ణ యోగి తెలిపారు. మూడు వారాలపాటు జరిగే ఈ శిబిరంలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంలో శిక్షణ ఇస్తారన్నారు. యోగా సాధన ద్వారా మానసిక, శారీరక సమస్యలతో పాటు బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులను నియంత్రణలో ఉంచుకోవచ్చన్నారు. మంగళగిరి ప్రాంత ప్రజలు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

సత్యహరిశ్చంద్ర నాటిక ప్రదర్శన



సత్య హరిశ్చంద్ర నాటిక ప్రదర్శిస్తున్న నటుడు

ఫణిదరం(తాడికొండ), మే 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో శ్రీరాముల వారి కల్యాణం సందర్భంగా సత్య హరిశ్చంద్ర పౌరాణిక పద్యనాటక ప్రదర్శనను సోమవారం తాడికొండ మండలం ఫణిదరం గ్రామంలో నిర్వహించారు. శ్రీ కరుణామయ బాలయేసు నాట్యమండలి వారి పర్యవేక్షణలో సత్య హరిశ్చంద్ర నాటికను ఆర్ శ్రీనివాసరావు, కేవీ రమణ, గుర్రాల వెంకటేశ్వర్లు, తుళ్లూరు వెంకటస్వామి హరిశ్చంద్ర వేషం వేసి నాటికను ప్రదర్శించారు.

నేడు బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపాల అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం

పెదనందిపాడు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నాగులపాడు శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనిలో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం కమిటీ సభ్యులు గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభించనున్నారు. వారం రోజుల పాటు స్వామి దేవస్థానంలో భజన భక్త సమాజాలతో ఏకాహం, సప్తాహ కార్యక్రమాలు జరగనున్నాయి. 13న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి కళ్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

మృత వీరుల ఆశయ సాధన కోసం కృషి చేద్దాం

● సీపీఎం నేత పాశం రామారావు

పెదనందిపాడు, మే 5(ఆంధ్రజ్యోతి): మృతవీరుల ఆశయ సాధన కోసం కృషి చేద్దామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మండల పరిధిలోని పాత బాపట్ల తాలూకా పాలపర్రులో మృతవీరుల సంస్మరణ సభ సోమవారం జరిగింది. మృతవీరుల స్థూపం వద్ద సీపీఎం నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ పాలకులు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజలను విభజించాలని చూస్తున్నారన్నారు. ముస్లింలపై దాడులు జరుపుతున్నారని దేశం నుంచి వెళ్లగొట్టే కుట్ర జరుగుతుందన్నారు. జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన దాడులను ముస్లింలను బాధ్యులను చేయడం హేయమైన చర్యగా వర్ణించారు. రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలను కల్పించి అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో పీ సుబ్బారావు, రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, చంద్రరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడేపల్లి సమీపంలో జరిగింది. సోమవారం మధ్యాహ్నం సుమారు 2 గంటలకు మంగళగిరి - కృష్ణ కెనాల్ రైల్వేస్టేషన్‌ల మధ్య సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు గల వ్యక్తి గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు సిమెంటు రంగు కాటన్ చొక్కాపై తెలుపు రంగు డిజైన్, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు గుంటూరు జీఆర్‌పీ సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డికి 8328018787లో గానీ, గుంటూరు జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్ 0863-222073లో గానీ తెలియజేయాలని రైల్వే పోలీసులు కోరారు.

దివ్యాంగులు, వృద్ధుల కోసం కొత్త చట్టాలు

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



వృద్ధులు, దివ్యాంగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, మే 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధుల కోసం కొత్త చట్టాలు వచ్చాయని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. సోమవారం తాడికొండ ఎంపీడీవో కార్యాలయంలో ఏడీఐపీ పథకం ద్వారా దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాలు, సహాయక పరికరాల పంపిణీ కోసం గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. దివ్యాంగులు, వృద్ధులపై వివక్షత చూపవద్దని హితవు పలికారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పోషించవలసిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. తల్లిదండ్రుల పోషణపై అశ్రద్ధ వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటారన్నారు. వైద్య పరీక్షల అనంతరం దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, టీడీపీ కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, టీడీపీ అధికార ప్రతినిధి గుంటుపల్లి మధుసూదనరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నీలాల కృష్ణారావు, ఎంపీడీవో కే సమతావాణి, నాలుగు మండలాల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా



సమావేశంలో ఐక్యతను వ్యక్తం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు

దుగ్గిరాల, మే 5 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్‌బాషా అన్నారు. దుగ్గిరాలలోని కళాశాల సంక్షేమ వసతి గృహంలో సోమవారం సాయంత్రం జరిగిన దుగ్గిరాల తాలూకా యూనిట్ ఏపీజీఈఎస్ కార్యవర్గ సమావేశంలో చాంద్‌బాషా మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల వేతన సవరణ సంఘ ఏర్పాటు, ఐఆర్‌ను జూలై 1 నుంచి అమలు చేయాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై మాట్లాడేది, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేది ఏపీజీఈ సంఘమేనన్నారు. తమ సంఘం ప్రభుత్వానికి, ఉద్యోగులకు వారధిగా పని చేస్తోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ రాజధాని నగరంలోనే ఇళ్లస్థలాలు కేటాయించాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి టీ లక్ష్మీనారాయణ, అందే బాలచంద్రమౌళి, వంకదార సుబ్బారావు, గుంటూరు పూర్ణప్రసాద్, మనోహర్‌రెడ్డి, నూకవరపు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిపూజ

● మంత్రి లోకేశ్ ఆదేశాలతో ముందుకు వచ్చిన దాతలు

● రూ.50 లక్షలతో నిర్మించనున్న నిప్పాన్, నిర్మాణ్ సంస్థలు



కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సంపత్ కుమార్, కిరణ్‌చంద్ తదితరులు

మంగళగిరి సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెద వడ్లపూడిలో నూతనంగా నిర్మించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలుకు నిప్పాన్ కోయి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ కుర్రా సంపత్‌కుమార్, మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్‌లు సోమవారం శంకుస్థాపన చేశారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నేత మాదల రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంపత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో నిప్పాన్ కోయి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, నిర్మాన్ ఆర్గనైజేషన్ సంస్థల సహకారంతో రూ.50 లక్షల వ్యయంతో కమ్యూనిటీ భవనాన్ని నిర్మించనున్నట్టు తెలిపారు. చదువుకున్న గ్రామానికి ఏదైనా సాయం చేయాలన్న ఉద్దేశంతో కమ్యూనిటీ హాలుకు తన వంతు సాయం చేస్తున్నట్టు వెల్లడించారు. పెళ్లిళ్లు, చిన్న చిన్న ఫంక్షన్లు జరిగినప్పుడు ఏ సామాజికవర్గం వారు కూడా ఇబ్బంది పడ కూడదనే ఉద్దేశంతో మంత్రి లోకేశ్ అన్ని కులాలకు కన్వెన్షన్ హాళ్లు, కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, నిర్మాన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు యలవర్తి సాయికుమార్, దినేష్‌కుమార్, ఫాదర్ గగారిన్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, కమ్యూనిటీ హాలు నిర్మాణ కమిటీ అధ్యక్షుడు దొప్పల కోటేశ్వరరావు, కార్యదర్శి దగ్గుబాటి నెహెమ్యా, గుడిమెట్ల మరియదాసు, చిట్టిబొమ్మ వెంకటేశ్వర్లు, అన్నే చంద్ర శేఖర్‌రావు, మద్దుకూరి రమేష్, గద్దె హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

● ఏపీ రైతు సంఘం



కుంచనపల్లిలో దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

తాడేపల్లి(కుంచనపల్లి), మే 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నేల కొరిగి దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం బీభత్సమైన గాలులతో అకాల వర్షం కురిసి పంటలు దెబ్బతిన్న రైతులను పరామర్శించేందుకు కుంచనపల్లి వెళ్లి నష్టపోయిన పంటల వివరాలను తెలుసుకున్నారు. గత నెలలో అకాల వర్షం కురిసి పసుపు, మొక్కజొన్న పంటలు కల్లాలలోనే తడిసిపోయాయని చెప్పారు. తిరిగి నెల రోజుల వ్యవధిలో కురిసిన అకాల వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాల్లో అరటి గెలలతో పాటు నేల కొరగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. అదేవిధంగా మొక్కజొన్న పంటకు కూడా బూజుపట్టి దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి శివనాగేశ్వరరావు, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

సోషలిస్టు పితామహుడు కార్ల్ మార్క్స్

● సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు

తుళ్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవాళికి మార్గదర్శకంగా ప్రపంచ మేధావి సోషలిస్ట్ పితామహుడు కార్ల్ మార్క్స్ అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు అన్నారు. సోమవారం తుళ్లూరు మండలం రాయపూడిలో కార్ల్ మార్క్స్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి వారి శ్రేయస్సు కోసం పెట్టుబడి అనే గ్రంథాన్ని రాశారన్నారు. పెట్టుబడి దారి దోపిడికి గురవుతున్న కార్మికుల శ్రేయస్సు కోసం జీవితాన్ని తనజీవితాన్ని త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతూ ఈశ్వరరావు, గుర్రంకొండ సత్యానందం, కంభంపాటి దేవుని దయ, ఉబ్బపల్లి కోటేశ్వరమ్మ చింతిరాల గాంధీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

● పెదనందిపాడు, మే 5(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు మెనిఫెస్టో ద్వారా ప్రపంచ గతిని మార్చిన మహోన్నత వ్యక్తి కార్ల్‌మార్క్స్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మండల పరిధిలోని పాలపర్రు పార్టీ కార్యాలయంలో మార్క్స్ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమేష్‌బాబు, హరిబాబు, శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి సీపీఐ కార్యాలయంలో..

తాడేపల్లి టౌన్, మే 5, (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ సీపీఐ కార్యాలయంలో కార్మికుల కోసం పోరాడిన కార్ల్ మార్క్స్ జయంతి వేడుకలు సోమవారం ఆపార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. తొలుత సీపీఐ సీనియర్ నాయకులు మానికొండ డాంగే కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, తుడిమిల్ల వెంకటయ్య, మానికొండ డాంగే, షేక్ బాషా, ప్రసాద్, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు

మాజీ ఎంపీటీసీ ఇంట్లో చోరీ

దుగ్గిరాల, మే 5 (ఆంధ్రజ్యోతి): రేవేంద్రపాడులో మాజీ ఎంపీటీసీ కొల్లూరు దమయంతి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. దమయంతి కుమారుడు కొల్లూరు వేణు, తన కుటుంబసభ్యులతో కలిసి ఇటీవల కొద్దికాలంగా విజయవాడలో ఉంటుంటున్నారు. ప్రస్తుతం రేవేంద్రపాడులోని ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో దుండగులు చోరీకి పాల్పడ్డారు. విజయవాడ నుంచి ఆదివారం రాత్రి వచ్చి చూసిన వేణు, ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఉండటం గమనించి లోపలికి వెళ్ళి చూడగా ఇంట్లోని కొన్ని విలువైన వెండి వస్తువులు, రిస్ట్‌వాచ్‌లు చోరీ జరిగినట్లు గుర్తించారు. చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.2లక్షల 40వేలు వరకూ ఉండవచ్చునని, వేణు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్ వెంకటరవి తెలిపారు.

చిల్లర దుకాణంలో నగదు చోరీ

మేడికొండూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరేచర్ల జంక్షన్ ప్రధాన రహదారి పక్కన ఉన్న చిల్లర దుకాణంలో సోమవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. జంక్షన్‌లోని సుబ్రమణ్యేశ్వర జనరల్ స్టోర్స్‌లో గుర్తు తెలియన ఒక దొంగ దుకాణం పైకప్పు రేకులను తొలగించి లోనికి ప్రవేశించి క్యాష్ బాక్స్‌లోని సుమారు పదివేల రూపాయల నగదును చోరీ చేశాడు. అనంతరం అదే పైకప్పులో నుంచి వెళ్లిపోయాడు. ఈ దృశ్యాలు సీసీటీవీలో రికార్డు అయ్యాయి. ఈ మేరకు షాపు యాజమాని మద్ది శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ దుకాణాన్ని సందర్శించి సీసీ ఫుటేజీని పరిశీలించారు. తరువాత క్లూస్ టీం రప్పించి ఆధారాలు సేకరించారు.

ప్రజలు శాంతి మార్గంలో పయనించాలి



భక్తులకు సందేశం ఇస్తున్న గుంటూరు విశ్రాంత పీఠాధిపతి గాలిబాలి

పెదనందిపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలు శాంతి మార్గంలో పయనించినప్పుడే సమాజం శాంతి స్థాపన జరుగుతుందని గుంటూరు విశ్రాంత పీఠాధిపతి గాలిబాలి అన్నారు. మండల పరిధిలోని అబ్బినేనిగుంటపాలెంలో మూడు రోజులుగా జరుగుతున్న వేళాంగిణి మాత మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా భాగయ్య మాట్లాడుతూ భక్తులు క్రీస్తుమార్గంతో పయనిస్తూ శాంతి, కరుణ, దయతో జీవించాలన్నారు. ఒకరిపై ఒకరు ప్రేమపూర్వకంగా మెలగాలని తెలిపారు. అనంతరం భక్తులు వేళాంగిణి మాతకు క్యాండిల్ వెలిగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు భారీ అన్నదానం జరిగింది.

మార్చురీ బాక్సు, జనాజా సెట్లు వితరణ

మంగళగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి అంజుమన్ సంస్థకు దాతలు మార్చురీ బాక్సు, రెండు జనాజా సెట్లను బహూకరించారు. టీడీపీ నేత షేక్ హుస్సేన్ తన తండ్రి షేక్ ఉద్దండ సాహెబ్ జ్ఞాపకార్థం రూ.లక్షా 50 వేల విలువైన ఏసీ వీఐపీ మార్చురీ బాక్సు, రెండు జనాజా సెట్లను అందజేశారు. స్థానిక అంజుమన్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ అక్రం, అంజుమన్ అధ్యక్షుడు షేక్ అల్తాఫ్, కార్యదర్శి హనీఫ్‌షా ఖాదరిలకు మార్చురీ బాక్సు, జనాజా సెట్లను దాతలు షేక్ హుస్సేన్, ఇంతియాజ్‌లు అందజేశారు. దాతలు గతంలో మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో పేదలకు రిక్షా బండ్లు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు. ఈ సందర్భంగా అంజుమన్ ప్రతినిధులు హుస్సేన్, ఇంతియాజ్‌లను అభినందించారు.

దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి శిబిరం

దుగ్గిరాల, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారిద్ర్యరేఖకు దిగువనున్న దివ్యాంగులను గుర్తించి వారికి కావలసిన ఉపకరణాలు అందించేందుకు శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 6వతేదీ మంగళగిరి మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరుగు కార్యక్రమంలో అర్హులైన వారు ఆదాయ ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరన్ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

వైభవంగా సాగిన కుంకుమ బండ్ల ప్రదర్శన

వట్టిచెరుకూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజనంపాడు గ్రామంలోని పోలేరమ్మ, అంద్దకమ్మ తిరునాళ్ళలో రెండవ రోజు అమ్మవార్లకు కుంకుమ సమర్పణ వైభవంగా సాగింది. కుంకుమను సమర్పించేందుకు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో కనక తప్పెట్ల వాయిద్యాల నడుమ మాతంగి కన్య ఆధ్వర్యంలో కుంకుమ బండ్ల ప్రదర్శన సాగింది. దేవాలయంలో అమ్మవార్లకు కుంకుమ సమర్పించి గ్రామస్థులు మొక్కులు తీర్చుకున్నారు.

వింజనంపాడులో పోలేరమ్మ, అద్దంకమ్మ తిరునాళ్ళలో మంగళవారం సిడిమాను మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేస్తుంది. తిరునాళ్ళలో భాగంగా ఉదయం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం సిడిమాను మహోత్సవం నిర్వహిస్తున్నట్టు దేవాలయ కమిటీ వెల్లడించింది.

దాసరి పేరుతో బెస్ట్ డైరెక్టర్ అవార్డు ఇవ్వాలి

● ఏపీ ఫిల్మ్ ఛాంబర్ డిమాండ్

తాడేపల్లి టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి వేడుకలను ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని కార్యాలయం ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన ఏపీ ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు అంబటి మధుమోహనకృష్ణ మాట్లాడుతూ దాసరి లాంటి గొప్ప దర్శకుడు తెలుగు ఇండస్ట్రీలో పుట్టడం తెలుగు చిత్ర పరిశ్రమ చేసుకున్న అదృష్టమని అన్ని కోణాలలో సినిమాలు తీయగలిగిన ప్రతిభ ఆయన ఒక్కడికే సొంతమన్నారు. ఏపీ ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ జేవీ మోహనగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సిని నంది అవార్డులలో బెస్ట్ డైరెక్టర్‌గా ఇచ్చే అవార్డుకు దాసరి పేరు పెట్టాలని ఫిల్మ్ ఛాంబర్ తరఫున డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.

ఆర్టీఈ ప్రవేశాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

● హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలి : కలెక్టర్ నాగలక్ష్మి



విద్యాహక్కు చట్టం పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, డీఈవో తదితరులు

గుంటూరు (విద్య), మే 5(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని దీనిపై మండల స్థాయి నుంచి విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. విద్యాహక్కు చట్టంపై సోమవారం కలెక్టరేట్‌లో పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం నిర్దేశించిన విధంగా, ప్రైవేటు అన్ ఎయి డెడ్ పాఠశాలల్లో, 2025-26 విద్యా సంవత్సరానికి, ఒకటో తరగతి ఉచిత ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈనెల రెండు నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని, మండల స్థాయిలో ఎంఈవోలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానంపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 19లోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో అనాథలు, హెచ్ఐవీ, వారికి ఐదు శాతం, ఎస్సీలకు పది, ఎస్టీలకు నాలుగు, వెనుకబడిన వర్గాల వారికి ఆరు శాతం సీట్లు లభిస్తాయన్నారు. మొదటి విడత సీట్ల కేటాయింపు లాటరీ ద్వారా 29న ప్రకటిస్తారని తెలియజేశారు. సమావేశంలో జేసీ భార్గవ తేజ, డీఈవో సీవీ రేణుక తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు టిఫిన్ బండ్లు అందజేత



చిరువ్యాపారులకు టిఫిన్ బండ్లు అందజేసిన టీడీపీ నాయకులు

మంగళగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో ముగ్గురు చిరువ్యాపారులకు మంగళగిరి కొత్త బస్టాండు వద్ద సోమవారం టిఫిన్ బండ్లు అందజేశారు. నవులూరు గ్రామానికి చెందిన షేక్ ఆదాంబీ, కృష్ణాయపాలెం గ్రామానికి చెందిన ఇరుకులపాటి రవికుమార్, ఉండవల్లి గ్రామానికి చెందిన గుంటితోట రాజేష్ తమకు సహకారం అందించాలని అర్జీల ద్వారా మంత్రి లోకేశ్‌కు విన్నవించుకున్నారు. స్పందించిన మంత్రి స్థానిక నేతల ద్వారా సోమవారం చిరువ్యాపారులకు టిఫిన్ బండ్లను అందజేయించారు. టిఫిన్ బండ్లు అందుకున్న లబ్ధిదారులు మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి మాట్లాడుతూ మంత్రి లోకేశ్ మంగళగిరిలో అడుగు పెట్టిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ యర్రగుంట్ల భాగ్యారావు, రుద్రు కోటేశ్వరరావు, కొత్తా శ్రీను, ఈపూరి ఇస్మాయిల్, మర్రి ఏసుబాబు, కట్టెపోగు ముత్తయ్య, పైలా రవికుమార్, పొన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సుహాస్ శెట్టి హత్యను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న హిందూ సంఘాల ప్రతినిధులు

మంగళగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): మంగళూరులో బజరంగ్‌దళ్ కార్యకర్త, గో సంరక్షకుడు సుహాస్ శెట్టి హత్యను నిరసిస్తూ ఓం శ్రీ మణిదీప్యం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మంగళగిరిలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సుహాస్ శెట్టి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు కిరణ్‌జీ, కల్యాణానంద స్వామీజీ, దయానంద స్వామీజీ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, మునగపాటి వెంకటేశ్వరరావు, శివానంద దత్త స్వామి, రామానంద దత్త స్వామి, పడమట రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనగణనలో కులగణన చారిత్రక నిర్ణయం

● దానబోయిన సుందరరావు యాదవ్



మాట్లాడుతున్న దానబోయిన సుందరరావు యాదవ్

తాడేపల్లి టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణన చారిత్రక నిర్ణయం అని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ అన్నారు. సోమవారం సాయంత్రం తాడేపల్లి కార్యాలయంలో విలేక రులతో మాట్లాడుతూ దేశ జనగణనతోపాటు కులగణన చేయాలని క్రేంద ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం వల్ల దేశంలో ఉన్న అన్ని కులాల జనాభా శాతంతోపాటు రాజకీయ సామాజిక, సమన్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా బీసీ కులాలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో ప్రజా ప్రతినిధులు అవుతారని సామాజిక న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో మండవ గోపాలరావు, గోలి శౌరి పాల్గొన్నారు.

బాధితులకు జంగాల ఆర్థికసాయం

తాడేపల్లి (ఉండవల్లి), మే 5, (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన బాధితులకు గుంటూరు టిడిపి తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్ మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో ఆర్థికసాయం అందించారు. గ్రామ తెలుగు యువత అధ్యక్షుడు డీ చైతన్య రేకుల ఇల్లు పూర్తిగా ధ్వంసమై భారీ గాలీ వానకు ఇంటిపై రేకులు గాలికి లేచిపడి పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే మోజెస్ అనే వ్యక్తికి చెందిన పశువుల పాక పూర్తిగా ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న జంగాల వెంకటేష్ ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించి చైతన్యకు రూ.15వేలు, మోజెస్‌కు రూ.4 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దొప్పలపూడి జ్యోతిబసు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ తిరునాళ్ల

పెదనందిపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రావిపాడులో పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం శిడిమాను మహోత్సవం గ్రామ వీధుల్లో జరుగుతుందని, అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పెదరావూరులో విద్యుత్ సమస్య పరిష్కరించండి

తెనాలిరూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): పెదరావూరులో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలోని పశువుల వైద్యశాల నుంచి 11కేవీ త్రీఫేజ్ కండెక్టర్ ద్వారా గ్రామంతో పాటు జంపని రోడ్డుకు, కూచిపూడి రోడ్డులోని రైస్, దాల్ మిల్లులకు, పెదరావూరు జగనన్న కాలనీలకు సరఫరా చేస్తున్నారన్నారు. దీంతో లోడ్ అధికమై సర్వీసులో అంతరాయం ఏర్పడుతోందని చెప్పారు. విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి సమస్య పరిష్కరించాలని కోరారు.

గ్రామీణ రహదారులు అధ్వానం

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు
● పట్టించుకోని అధికారులు


పూర్తిగా దెబ్బతిన్న దావులూరు -చక్రాయపాలెం రహదారి

కొల్లిపర, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఈ రోడ్లపై వెళ్లాలంటేనే వాహనదారులు, రైతులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లు దెబ్బతిని సంవత్సరాల తరబడి కావస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో దావులూరు నుంచి చక్రాయపాలెం వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డు దెబ్బతిని సంవత్సరాలు కావస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. ఈ రోడ్డు దెబ్బతినటానికి కారణం కాంట్రాక్టర్ల లోపమే ప్రధానకారణమని గ్రామస్థుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. రోడ్డు నిర్మాణం నాణ్యతగా లేకపోడంతో అతి తక్కువ కాలంలో దెబ్బతిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా చివలూరు నుంచి మున్నంగి వెళ్లే రోడ్డు కూడా మరింత అధ్వానంగా తయారైంది. రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. రోడ్డు గోతులమయంగా మారడంతో ప్రయాణం చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిరిపురం నుంచి నేలపాడు మీదుగా తెనాలి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతినటంతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ఈ విషయం అనేక పర్యాయాలు సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై రాత్రి సమయాల్లో వాహనదారులు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా రోడ్లను నూతనంగా వేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


అధ్వానంగా తయారైన చివలూరు-మున్నంగి రోడ్డు

పురపాలక సంఘానికి ఐదు అర్జీలు

తెనాలి, మారీసుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు వచ్చాయని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అన్నారు. సోమవారం పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంజనీరింగ్ సెక్షన్‌కి రెండు, టౌన్‌ప్లానింగ్ విభాగానికి రెండు, హెల్త్ సెక్షన్‌కు అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి త్వరతగతిన పరిష్కరిస్తామని అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘ పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో 11...

తెనాలి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 దరఖాస్తులు అందించారు. రెవెన్యూ 4, మున్సిపల్ 3, హౌసింగ్, పోలీసు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన ఒక్కో దరఖాస్తు అందజేశారని కార్యాలయ అధికారులు వెల్లడించారు.

తహసీల్దార్ కార్యాలయానికి 18 ...

తెనాలి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 18 అర్జీలు అందినట్లు డీటీ జాన్ తెలిపారు. అందులో 6 సర్వేకు రాగా, 1 ఏపీ టీచర్స్ ఫెడరేషన్ సంబంధించి, రేషన్ షాపు మార్పు కోసం 1, ఇతర సమస్యతో 10 వచ్చాయన్నారు. నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు.

కొల్లిపరలో ఐదు...

కొల్లిపర, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు దరఖాస్తులు రావటంతో వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో పెట్టిన ప్రతి దరఖాస్తును పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రీవెన్స్‌కు హాజరైన వారిలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో 8...

పొన్నూరు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎనిమిది ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెవెన్యూకు సంబంధించి ఆరు ఫిర్యాదులు, పంచాయతీరాజ్‌కు1, సర్వే కోసం1 ఫిర్యాదులు అందాయి.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని యువకుడి మృతి

పొన్నూరు టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని సోమవారం అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని బ్రిడ్జి పక్కన గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు నాలుగురోజుల క్రితమే మృతిచెందినట్లు అనుమానిస్తున్నారు. యువకుడు హత్యా... ఆత్మహత్యా... అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనుమానస్పద మృతికింద కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.

ద్విచక్రవాహనం చోరీపై కేసు నమోదు

తెనాలిరూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఉంచిన వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని కఠెవరం గ్రామానికి చెందిన శివనాగకృష్ణ ఏప్రిల్ 30 రాత్రి తన ద్విచక్రవాహనాన్ని ఇంటిముందు నిలిపాడు. ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం రూరల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్ పేర్కొన్నారు.

అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం

పొన్నూరు టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తుందని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ శ్యా మల అన్నారు. పట్టణంలోని 19వ వార్డు, ఎస్సీకాలనీ, అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించే పౌష్టికాహారం, ప్రీస్కూల్ విద్య గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, కుమారి, వెంకటేశ్వరమ్మ, కుసుమ కుమారి, శిరీషా పాల్గొన్నారు.


డాక్టర్ హనుమంతరావు దంపతులను సత్కరిస్తున్న ఆతుకూరి ఆంజనేయులు, చాంబర్ సభ్యులు

యువత ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

● చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో యువత ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. తెనాలికి చెందిన ఆయుర్వేద వైద్యులు డాక్టర్ హనుమంతరావు, సతీమణి నగరాజకుమారి దంపతులు 70రోజుల పాటు కాలి నడకన ప్రయాణం చేసి పుణ్యక్షేత్రాలైన కాశీ, ప్రయాగ దర్శించుకున్న సందర్భంగా ఆ దంపతులను జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం దైవ స్మరణ చేయటంతో పాటు ఆధ్యాత్మిక యాత్రతో అదనపు శక్తి వస్తుందని, మానవజాతి శాంతి సమాజానికి ఆధ్యాత్మికత ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు టీఎల్‌వీ వీరాంజనేయులు, ఆతుకూరి నగేష్‌కుమార్, వీవీ నాగిరెడ్డి, రామసుబ్బారావు, కొప్పురావూరి ఏడుకొండలు, గార్లపాటి సత్యనారాయణ, షరాబు కృష్ణమూర్తి, అమర శ్రీనివాసరావు, కొత్తమాసు శ్రీనివాసరావు, డీవీ రవికుమార్, చిరంజీవి తదితరులున్నారు.


జేసీబీతో ఆక్రమణలను తొలగిస్తున్న మునిసిపల్ అధికారులు

డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు

తెనాలి, మారీసుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు చేపట్టారు. సోమవారం స్థానిక చెంచుపేటలో డ్రెయిన్లను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సాంబశివరావు మాట్లాడుతూ మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశాలతో పట్టణ అభివృద్ధి పనులలో భాగంగా నిర్మిస్తున్న నూతన డ్రెయిన్ల నిర్మాణాల కోసం అక్రమణలను తొలగిస్తున్నామన్నారు. ముందుగానే భవన యజమానులకు స్వచ్ఛందంగా తొలగించాలని సమాచారమిచ్చామన్నారు. ఈ సందర్భంలో కొంతమంది భవన యజమానులు మునిసిపల్ అధికారులతో వాగ్వివాదానికి దిగి పనులకు ఆటంకం కలిగించగా పోలీసు సిబ్బంది వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించి ఆక్రమణలను తొలగింపజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ టీపీవో సాంబశివరావు, సర్వేయర్ శ్రీనివాసరావు, చైర్మన్ రామారావు, మునిసిపల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

● మండల వైద్యాధికారి సుమంత్

కొల్లిపర, మే 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తున్న మెడికల్ క్యాంపులను పేదప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు. సోమవారం మండలంలోని పిడపర్రులో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు వైద్యుల సలహామేరకు మందులను వాడుకోవాలన్నారు. మెడికల్ క్యాంపు ఏర్పాటుచేయడం వలన దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మున్నీషాబేగం, డీఈవో బొమ్మ కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు ప్రసన్న, హైమావతి పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొల్లిపర, మే 5 (ఆం ధ్రజ్యోతి): పేదప్రజలు ఉ పాధిహామీ పథకాన్ని స ద్వినియోగం చేసుకోవాలని ఏపీవో వెంకయ్య అన్నారు. సోమవారం మండలంలోని చివలూ రు, కొల్లిపర, వల్లభాపు రం, మున్నంగి, దంతలూరు, అత్తోట తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూ లీలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల కూలీలు సమయపాలనను తప్పని సరిగా పాటించాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించినట్లు తెలియజేశారు. ఉపాధిహామీ పథకం ద్వారా నిరుపేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందన్నారు. కూలీలకు కొలతలు బట్టి వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు వల్లభాపురం బుజ్జిబాబు, కనపర్తి సాగర్, వి.రాజేంద్ర, కోటేశ్వరరావు, సునీల్ పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. సోమవారం ఎస్‌వీ యోగా సభ్యులు ముద్దాభక్తుని సాయికృష్ణ, దివ్య దంపతుల కుమారుడు నాగకౌశిక్, కుటుంబ కుటుంబ సభ్యుల సహకారంతో పాదచారులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ వ్యవస్థాపక అధ్యక్షుడు కాకరపర్తి సుబ్రహ్మణ్యం పాల్గొని మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు, ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, సాంబ్రాజ్యం, కుర్రా శ్రీనివాసరావు, ప్రతాప్, ప్రదీప్, శేఖర్, యోగ సాధకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఈ ప్రవేశాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

● మండల స్థాయిలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలి
● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి


పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవతేజ డీఈవో రేణుక తదితరులు

గుంటూరు (విద్య), మే 5(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకా రం ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని దీనిపై మండల స్థాయి నుంచి విస్తృతప్రచారం కల్పించాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. విద్యాహక్కు చట్టంపై సోమవారం కలెక్టరేట్‌లో పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ విద్యాహక్కు చట్టం నిర్దేశించిన విధంగా, ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో, 2025-26 విద్యా సంవత్సరానికి, 1వ తరగతి ఉచిత ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈనెల రెండు నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని, మండలస్థాయిలో ఎంఈవోలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూ చించారు. హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానంపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 19లోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో అనాథలు, హెచ్ఐవీ, వారికి ఐదుశాతం, ఎస్సీలకు పది, ఎస్టీలకు నాలుగు, వెనుకబడిన వర్గాలవారికి ఆరుశాతం సీట్లు లభిస్తాయన్నారు. మొదటి విడత సీట్ల కేటాయింపు లాటరీ ద్వారా 29న ప్రకటిస్తారని తెలియజేశారు. సమావేశంలో జేసీ భార్గవ తేజ, డీఈవో సీవీ రేణుక తదితరులు పాల్గొన్నారు.

విష్ణుమూర్తిగా భావన్నారాయణస్వామి


విష్ణుమూర్తిగా పూజలందుకున్న భావన్నారాయణ స్వామి

పొన్నూరు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): శ్రీ సాక్షి భావనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం భావనారాయణస్వామి విష్ణుమూర్తిగా పూజలందుకున్నాడు. ఉత్సవాలలో భాగంగా ఉదయం ఆలయంలో పెండ్లి కుమారుని ఉత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీసుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఉత్సవమూర్తులకు చందనోత్సవం పంచామృత అభిషేకాలు కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తిగా భావదేవుడు భక్తులు పూజలందుకున్నారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంపై కొలువుదీరిన భావనారాయణస్వామి నగరోత్సవం పట్టణంలో కన్నుల పండుగలా జరిగింది. ఉత్సవాలను వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరవగా విష్ణుసహస్ర పారాయణ కార్యక్రమాలు జరిగాయి.


వీవీఐటీయూలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దంత వైద్యులు

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో దంత వైద్య పరీక్షలు

పెదకాకాని, మే 5 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న 10ఏ గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ, గుంటూరు గ్రూప్ వార్షిక శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్యాడెట్లకు సిబార్ దంత వైద్యశాల డాక్టర్ల పర్యవేక్షణలో దంత పరీక్షలను సోమవారం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న 426 మంది క్యాడెట్లకు దంత పరీక్షలు నిర్వహించి తగు సూచనలను అందించారు.

రాజ్యసభ సభ్యుడు సత్యనారాయణకు సన్మానం

తెనాలి అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ తరపున రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన పాకాల వెంకటసత్యనారాయణను రాష్ట్ర బీసీ సంఘ అధ్యక్షుడు కేసన శంకరరావు సత్కరించారు. సోమవారం అమరావతి సచివాలయంలో ఎన్నిక ధృవీకరణ పత్రం తీసుకునేందుకు వచ్చిన ఆయనను బీసీ నాయకులతో కలిసి అభినందించారు. బీసీ సామాజికవర్గ ప్రతినిధిగా క్రమశిక్షణతో పని చేస్తున్న ఆయనను బీజేపీ అధిష్టానం రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. పార్టీకి సేవలు అందించడంతోపాటు బీసీల అభ్యున్నతికి అవసరమైన కృషి చేయాలని కోరారు. వాకా రాంగోపాల్, వీరంకి రంగారావు, తాతా సాంబశివరావు, తుళ్లూరు శ్రీనివాసరావు, చందు శ్రీనివాసరావు, బెల్లంకొండ సురేష్, వాకా సాంబశివరావు పాల్గొన్నారు.


గోదాదేవి కల్యాణంలో స్వామివార్లు, పీఠాధిపతి, భక్తులు

కనుల పండుగగా గోదాదేవి కల్యాణం

తెనాలిరూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): శ్రీగోదాదేవి రంగనాథ స్వామివార్ల కల్యాణం కనులపండుగగా నిర్వహించారు. మండలంలోని అంగలకుదురు ఆంధ్ర వాల్మీకి వాసుదాసుస్వామి పరంపరపీఠం దాసుకుటిలో సోమవారం గోదాదేవి రంగనాథస్వామివార్ల కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పీఠాధిపతి సీతారామదాసు స్వామి పర్యవేక్షణలో జరిగిన పూజల్లో అర్చకులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

పూర్వ పద్ధతిలోనే పునరుద్ధరణ చేపట్టాలి

● పాఠశాలలపై ఏపీటీఎఫ్ నాయకుల డిమాండ్

తెనాలి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పూర్వ పద్ధతిలోనే పాఠశాలల పునరుద్ధరణ చేపట్టాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. జోన్ కన్వీనర్ పుట్టా జనార్ధనరావు మాట్లాడుతూ, జీవో 117ను రద్దు చేశామంటున్న ప్రభుత్వం 9రకాల పాఠశాలల విధానాన్ని అమలు చేయడం సరి కాదన్నారు. గతంలో ప్రాథమిక విద్యారంగం ఎలా ఉందో అదే విధంగా 3, 4, 5 తరగతులను నిర్వహించాలన్నారు. జీవో రద్దు చేసి, మళ్లీ ఈ ప్రభుత్వం ప్రాథమిక విద్యలో ప్రయోగాలు చేస్తూ గందరగోళం సృష్టిస్తోందన్నారు. యువగళం పాదయాత్రలో విద్యా మంత్రి లోకేశ్ హామీ ఇచ్చిన మాదిరిగానే 1 నుంచి 5 తరగతులు ప్రాథమిక పాఠశాలల్లో 6 నుంచి 10 లేక 12 తరగతులు ఉన్నత పాఠశాలల్లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫౌండేషన్ పాఠశాలల నిర్ణయం సరికాదని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలన్నారు. 44మంది విద్యార్థులు మించితే మరో సెక్షన్ ఇవ్వాలని, ప్రతి ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 9న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, 14న విజయవాడలో మహాధర్నా చేపడతామని హెచ్చరించారు. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటుచేసి ఐఆర్ ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలన్నింటిని చెల్లించాలని, ఉద్యోగ విరమణ మూడు సంవత్సరాలలో ఉన్న వారిని బదిలీలలో మినహాయించాలన్నారు. లక్ష్మణకుమార్, శ్రీనివాసరావు, యోహాను, దుర్గారావు, యేసుబాబు, సుబ్బారావు, యోబు పాల్గొన్నారు.

పొన్నూరులో నిరసన

పొన్నూరు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో అవలంబిస్తున్న అశాస్త్రీయ విధానాలను విడనాడాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా అన్నారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు జరిగాయి. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ అసంబద్ధ అశాస్త్రీయ విధానాలను ప్రభుత్వ వదలిపెట్టాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు మల్లంపాటి వెంకటేశ్వర్లు, ఎంఎం ఖుద్దూస్, ఎం.వెంకటేశ్వరరావు, పీ బాలకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, ఏ శ్రీనివాసరావు, అన్వర్, తమీజ్, తదితరులు పాల్గొన్నారు.

27వ మైలురాయి నాటికకు ప్రథమ బహుమతి


బహుమతి అందుకుంటున్న కళాకారులు

తెనాలి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం కొలకలూరులో జరిగిన ఆహ్వాన నాటికల పోటీల్లో 27వ మైలురాయి నాటికకు ప్రథమ బహుమతి లభించింది. కొలంకపురి నాటక కళా పరిషత్, శ్రీసాయి ఆర్ట్స్ సంయుక్తంగా మూడు రోజుల పాటు నాటికల పోటీలు నిర్వహించారు. విజయవాడ యంగ్ థియేటర్స్ ఆర్ట్స్ అసోసియేషన్ కళాకారులు ఈ బహుమతి అందుకున్నారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా విశాఖపట్నం చైతన్య కళా స్రవంతి కళాకారులు ప్రదర్శించిన అసత్యం నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శనగా, హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ కళాకారులు ప్రదర్శించిన నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ నటుడిగా గోవాడ వెంకట్, ఉత్తమ నటిగా సురభి ప్రభావతి, క్యారెక్టర్ నటుడిగా పవన్ కుమార్, నటిగా రాజేశ్వరి, సహాయ నటునిగా బుర్రా నైరెన్, ప్రతినాయకుడిగా అనీల్‌కుమార్, హాస్యనటుడిగా సురేంద్రబాబు, డైలాగ్ ఆర్టిస్టుగా రత్నకుమారి, బాలనటుడిగా మణికంఠ, ఉత్తమ దర్శకుడిగా బాలాజీనాయక్, రచయితగా మాధవ్, రంగాలంకరణలో కుమార్, ఆహార్యంలో నాగూర్, లైటింగ్‌లో థామస్, సంగీతంలో లీలామోహన్ బహుమతులు అందుకున్నారు. స్వేచ్ఛ, కిడ్నాప్, మతమా మానవత్వమా నాటికలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా ఆంజనేయ నాయుడు, కృష్ణ ప్రసాద్, సత్యనారాయణ వ్యవహరించారు.


ఎంపికైన విద్యార్థులతో చైర్మన్, మాజీ ఎమ్మెల్యే శివకుమార్

విప్రోలో ఏఎస్ఎన్ విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ విప్రోకి ఏఎస్ఎన్ కళాశాల విద్యార్థులు 11మంది ఎంపికయ్యారని విద్యాసంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. సోమవారం కళాశాలలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. బీసీఏ, బీఎస్సీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రాం కింద కంపెనీ ఎంపికచేసిందని చెప్పారు. కంపెనీలో పనిచేస్తూ బిట్స్ పిలానీలో ఎంటెక్ ప్రోగ్రాం పూర్తిచేయడానికి అవసరమైన ఖర్చులను విప్రో భరిస్తుందన్నారు. కంపెనీల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందిస్తున్నామని, దీంతో అత్యధికశాతం తమ కళాశాల విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొలసాని రాంచంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.